ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

డిసెంబర్ 3, 2006

3/12
కథా నిలయం
Entered

హ్యాపీ బర్త్‌డే

(3.12.2006 నుంచి
9.12.2006 వరకు)

జి. ఐల
3సం॥, డిసెంబర్-4
సుమిత్ర-రమణ
విశాఖపట్నం



దిలీప్‌కుమార్
6సం॥, డిసెంబర్-5
అనురాధాదేవి-మురళీకృష్ణ
చీడిగ-కాకినాడ

వి. రోహిత
10సం॥, డిసెంబర్-8
శ్రీలక్ష్మి-సుబ్బారావు
మలక్‌పేట్-హైదరాబాద్

మనీష్ కుమార్
డిసెంబర్-8
లత-ఉదయ్
గౌతమీనగర్-గోదావరిఖని

జి. వికాస్
5సం॥, డిసెంబర్-2001
వరలక్ష్మి-ప్రకాష్
సీతారామపురం-మిర్యాలగూడ

డి. ధీరజ్
స్వప్న-జీవన్‌బాబు
గవర్నర్‌పేట-విజయవాడ

ఎల్. కాశ్యప్
గుణశ్రీ-రామారావు
శ్రీకాకుళం



సమతుల్యత దెబ్బతింటే సమస్యలు తలెత్తుతాయి

మన అతిథి గురించి...

పేరు	: లంక ఆదినారాయణ
జననం	: 23.09.1934, అనంతపూర్
విద్య	: ఎం.ఎ, పిహెచ్‌డి
వృత్తి	: బోధన
అవార్డు/గుర్తింపు	: 1984లో రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు, రిఫరెన్స్ ఏషియా పుస్తకంలో హూ ఈజ్ హూగా గుర్తింపు, అమెరికన్ బయోగ్రాఫికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రచురించిన ప్రపంచంలోని ఐదు వేలమంది ప్రముఖ వ్యక్తుల్లో స్థానం.
ఆదర్శం	: మహాత్మాగాంధీ, వివేకానంద
నచ్చిన పుస్తకం	: భగవద్గీత
ఆశయం	: సమాజానికి ఉత్తమ విద్యార్థులను అందించడం
బలం	: బోధన
బలహీనత	: ఎక్కువగా చదవడం

దేశకాలమాన పరిస్థితులనుబట్టి విలువలు మారుతుంటాయి. ఈ మార్పుల్లో సమతుల్యత ఉండాలి. విలువలు రెండు రకాలు. మారేవి, మారనివి. సత్యం, ధర్మం ఇవి రెండూ ఎప్పుడూ మారవు. వీటిని అలవర్చుకోవాలి. ఏ పనిచేసినా ఒకరికి ఉపయుక్తంగా ఉండాలి. తమ పనివల్ల ఇతరులు నష్టపోకూడదు. అది నాకే దక్కాలనుకోవడం తప్పు కాదు. అయితే కోరుకునేటప్పుడు ఇతరులను మోసగించడం, నష్టపరచడం తప్పు. మనం ప్రస్తుతం గ్లోబలైజేషన్‌లో ఉన్నాం. పోటీ పెరిగిపోతోంది. మనమధ్య కావాల్సింది ఆరోగ్యకరమైన పోటీ. పోటీ ఒక్కటే కాదు, కావాల్సింది సహకారం. సమాజంలో ప్రతి ఒక్కరూ ఒకరిపై ఒకరు ఆధారపడాల్సిందే. ఈ సమతుల్యత దెబ్బతింటే సమస్యలు తలెత్తుతాయి. జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన పంచశీల లాంటివి ప్రస్తుతం ప్రవేశపెట్టాల్సిన అవశ్యకత ఉంది. మన విద్యుక్తధర్మాన్ని నిర్వహించాలి. ఫలితంగా ఎలాంటి సమస్యలు తలెత్తవు.

ఈ సంచికలో...

టపా ... 2

మనమూ మన నమ్మకాలు ... 4

సలహాలు ... 5

ఇంటి సంగతులు ... 6

క్యాంపస్ ఛాట్ 10

సినిమా కబుర్లు ... 11

బాలనేస్తాలు ... 12

అట్టమీది కథ ... 14

ఇంకా...

ఇలా వుందామా... 7

అంత అవసరమా?

సీరియల్ 8

తెలుగుగడ్డ

కథ 18

నీ లేఖ

అవీ...ఇవీ ... 20

చల్తే... చల్తే ... 21

మనసా... తెలుసా ... 22

విజ్ఞానవీచిక ... 23

కొత్త పుస్తకాలు ... 24

సందర్భోచితం

'స్నేహ' సంచికలో అందించిన అట్టమీది కథ 'బులిపించే బుల్లిపెట్టె'ను ప్రపంచ టెలివిజన్ దినోత్సవ సందర్భంగా అందించడం బావుంది. టీవీల వలన ఉపయోగాలు కొన్ని ఉన్నప్పటికీ, ఎక్కువసేపు చూడడం వల్ల కొన్ని శారీరక సమస్యలు వస్తాయి. టీవీలో కొన్ని కార్యక్రమాలు పిల్లల మనసులపై తీవ్రప్రభావం చూపుతాయి. ఈ పరిణామాలు ప్రమాదకరాలే అని చెప్పకతప్పదు. ఆరోగ్యంలో ఇన్ఫ్లుయెంజా గురించి అవగాహన కలిగేలా వివరించారు. 'అవి...ఇవి..'లోని అంశాలు అలరింపజేశాయి. 'విజ్ఞానవీచిక'లో వివరించినట్లు మళ్లీ చంద్రలోకయాత్రలు ప్రారంభమవటం, అందునా ఒక భారతీయుడ్ని చంద్రుని మీదకు పంపాలని ప్రయత్నించటం, హర్షణీయ పరిణామం. నరసింహరావుగారి న్యాయపరమైన సలహాలతో ఎన్నో విషయాలు తెలుస్తున్నాయి. టీవీ ప్రసారాలకు ప్రజలు ఎంతగానో బానిసలయ్యారనడానికి కార్టూన్లు దర్పణం పడుతున్నాయి. సినిమాకబుర్లు బావున్నాయి.

- నేమాన సుభాష్‌చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం

అక్షరాలా నిజం

ఇలా ఉందామాలో 'ప్రైవేట్ భూతం' ప్రపంచీకరణ ఫలితాలను చక్కగా వివరించింది. ప్రైవేటు సంస్థలకు ఎలాంటి పరిస్థితులలోనూ అవకాశం కల్పించకూడదు. అది కనిపించనిభూతం అంటూ రచయిత చెప్పిన మాటలు అక్షరాలా నిజం. ఇంటి సంగతులులో కొత్తపిచ్చి బాగుంది. తెలుగుగడ్డ సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది.

- కె. హిమశంకర్, కడప

ఇడియట్ బాక్స్

నవంబర్ 21, ప్రపంచ టెలివిజన్ దినోత్సవం సందర్భంగా టీవీపై అందించిన కవర్‌స్టోరీ చాలా బాగుంది. జెవల్ బెయిర్డ్ కనిపెట్టిన ఈ ఆధునిక సాధనం ఇంత ప్రజాదరణ పొందుతుందని ఆయన కూడా ఊహించి ఉండరనడం ఎంతో వాస్తవం. దేనికైనా మంచీచెడూ రెండూ ఉంటాయి. మహిళలు, పిల్లలు యువత ఇలా అన్ని వర్గాల వారిని అలరిస్తోంది టెలివిజన్. ప్రపంచంలో జరిగే అన్ని విశేషాలనూ అందిస్తూ, ఎంతో విజ్ఞానాన్ని మన ముందుంచుతోంది. అయితే ఎంతటి విజ్ఞానవంతులను చేస్తోందో అంతటి సోమరిపోతులనూ తయారుచేస్తోంది. మానవుడు తెలివిగా ఉపయోగించుకుంటే నిజంగా ఇది విజ్ఞాన సాధనమే. లేదంటే ఇది ఖచ్చితంగా ఇడియట్‌బాక్స్ అని చెప్పకతప్పదు.

- మట్టూరు అజయ్‌కుమార్, చిలకలూరిపేట, గుంటూరు

ప్రముఖ పాత్ర

ప్రపంచ జీవనవిధానంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న బుల్లిపెట్టె ప్రపంచమంతా వ్యాపించింది. సకల జనానికి సందడినిస్తోంది. తమాషా చేస్తోంది. పావలా కథ బాగుంది. అవీఇవీ బాగుంటున్నాయి.

- వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు.

అక్షరాలా నిజం

ఇలా ఉందామాలో 'ప్రైవేట్ భూతం' ప్రపంచీకరణ ఫలితాలను చక్కగా వివరించింది. ప్రైవేటు సంస్థలకు ఎలాంటి పరిస్థితులలోనూ అవకాశం కల్పించకూడదు. అది కనిపించనిభూతం అంటూ రచయిత చెప్పిన మాటలు అక్షరాలా నిజం. ఇంటి సంగతులులో కొత్తపిచ్చి బాగుంది. తెలుగుగడ్డ సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది.

- కె. హిమశంకర్, కడప

సహజంగా

మనమూ మన నమ్మకాలు శీర్షికలో బామ్మఉత్తరం సహజంగా వుంది. సూరి లాంటి వాళ్లు చాలామందే ఉంటారు. ఆరోజు కాకతాళీయంగా ఏదైనా జరిగితే అది ఫలానా వారి మొహం చూడడంవల్లే సంభవించిందని నిర్ధారణకొచ్చేస్తారు. నీరజ తెలివిగా వ్యవహరించిన తీరు బాగుంది. కార్టూన్లు హాయిగా నవ్వించాయి.

- వి. అనుపమ, హైదరాబాద్

కమ్మటి కథ

'గంగపుత్రులు' కథ మనస్సుకు హత్తుకునేలా వుంది. కమ్మటి కథ చదివే అవకాశాన్ని కల్పించారు. అవీఇవీ పేజీ బాగా నవ్వించింది. పారిశ్రామిక, ఆర్థికావసరాలు మనిషిని చంద్రునిమీదకు నెడుతున్నాయని విజ్ఞానవీచికలో వివరించిన తీరు బాగుంది.

- కేశవ్, తిరుపతి

అతిశయోక్తి కాదు

నవంబర్ 19, 2006 నాటి ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో 'అట్టమీది కథ' బులిపించే బుల్లిపెట్టె కాకర్లమూడి విజయ్‌గారి కథనంవల్ల టీవీ ఉపయోగాలు, అనర్థాలు తెలుసుకున్నాం. సర్వమానవాళిని ఆనందడోలికల్లో ముంచెత్తుతూ, అని రకాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటున్న బుల్లితెర సృష్టికర్త జాన్‌లోగీ బెయిర్డ్ పేరును ఎవ్వరూ జ్ఞప్తికి తెచ్చుకోకపోవడం, ఇంత ఆనందానికి కారణభూతులైనటువంటి గొప్ప వ్యక్తిని స్మరించకపోవడం నిజంగా విచారకరం. కాబట్టి ప్రతి టీవీ చానల్‌వారి 'లోగో' ముందు 'జాన్ లోగీ బెయిర్డ్' పేరును పెద్ద అక్షరాల్లో ప్రచారమయ్యేట్లు చేస్తే ఆ మహనీయుడికి నివాళులర్పించిన వారమవుతాం. కనీసం ప్రపంచ టీవీ దినోత్సవం జరుపుకుంటున్న రోజునైనా అతని పేరును ప్రజలకు తెలియజేయాల్సి ఉంటుంది. టీవీ అందరికీ ఒకేరకమైన లాభాలు, ఉపయోగాలు కలిగించలేకపోయినా వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ప్రసారాల వల్ల దేశాల మధ్య సయోధ్య కలిగించడానికి, ప్రపంచ శాంతి భద్రతల ఆర్థిక సమాజికాభివృద్ధి సాధించడానికి సాధ్యపడుతోంది. ప్రజలకు ప్రయోజనకర అంశాలపై అవగాహన కలిగించి, సమాచార వ్యాప్తికి తోడ్పడంవల్ల టీవీ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంటోందనడంలో అతిశయోక్తిలేదు.

ఇహపోతే 'ఇలా ఉందామా' శీర్షికన ప్రైవేటు భూతం కథనం వాస్తవానికి అద్దం పట్టినట్లుగా ఉంది. 'ఆరోగ్యం' శీర్షికన మధుమేహవ్యాధి గ్రస్తులకు ఇన్ఫ్లుయెంజా వ్యాక్సిన్ ఎంతో సురక్షితమైందని, అది న్యూమోనియా వంటి రోగాలనూ దూరం చేస్తుందని చక్కగా చెప్పారు.

- సొరెడ్డి రామచంద్రారెడ్డి, యాడికి, అనంతపురం జిల్లా

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	రూ.
రూ.130/-	రూ.170/-	రూ.210/-	510/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

రూ. 150/-కే

ఇవన్నీ!

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్కసీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

- కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/-లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3914

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

మనమూ- మన నమ్మకాలు

పి. జ్యోతి

అనుమానపు పక్షి

"ఇదెక్కడి గోలండీ! ఆ హోరెత్తే టీవీ చప్పుడులో పిల్లలకు చదివే చదువు మనసుకు పట్టడంలేదు. ఒకరితోఒకరం ఏం మాట్లాడుతున్నామో వినబడటంలేదు. లేచిన దగ్గరినుండీ అందరితో అరిచీ అరిచీ నా గొంతు బొంగురుపోయి మాటే రావడం లేదు" అంది ఆమని. పొద్దున్నే టీవీ సౌండ్ పెద్దగా పెట్టి, పేపరు చదువుతోన్న భర్తతో.

"ఏమిటోయ్! ఏమిటంటున్నావ్. నాకేం వినబడడం లేదు. అలా నీలో నువ్వే మాట్లాడుకుంటే నాకెలా వినబడుతుంది. కాస్త పెద్దగా చెప్పొచ్చు కదా" అన్నాడు ఆనంద్ అక్కడినుండి లేవకుండా.

"ఒరేయ్! ఇప్పటికి ఇరవై ఒకటోసారి నిన్ను పిలవడం. కాస్త ఆ టీవీ సౌండ్ తగ్గించరా! అసలే హార్ట్‌పేషెంట్‌ను, నా గుండె దడదడ లాడిపోతోందిరా" అన్నాడు లోపలిగదిలోనుండి పడుకున్న వాడల్లా లేచి కూర్చున్న అనంత్ తండ్రి రాజేశ్వర్.

"తెల్లవారితే చాలు వెధవ టీవీగోల. ఓ పక్క పిల్లలు చదువుకుంటున్నారు. మరో పక్క హార్ట్ ఆపరేషన్ అయిన మావగారు పడుకుని ఉన్నారన్న ధ్యాసేలేదు. ఇల్లంతా రీసౌండ్‌తో మారుమోగిపోతోంది" అంటూ టీవీ సౌండ్ తగ్గించడానికి దగ్గరికి వెళ్ళింది ఆమని. అది మారుమోగుతున్నంతవరకూ అతనితో ఏం చెప్పినా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్టేనని ఆమెకు తెలుసు.

వెంటనే ఆనంద్ ఆమె చేతిలోని రిమోట్ లాక్కుని "అమ్మో! అంతపని మాత్రం చెయ్యకు, అదలా మోగుతూనే ఉండాలి. నేనిలా పనులు టకటక చేసుకుంటూనే ఉండాలి. అది ఆగిపోయిందంటే నేను కూడా పనులు చేయడం ఆటోమాటిగ్గా ఆపేయవలసి వస్తుంది. అదెందుకో నీకు తెల్సికూడా ఇలా చేయడం ఏమీ బాగోలేదు ఆమూ" అని చెప్పుకుపోతున్నాడు.

ఇంతలో బయటినుండి "అనంత్‌గారూ! అనంత్‌గారూ! అరగంట నుండి అరిచీ అరిచీ ఛస్తున్నాడండీ మీ పాలవాడు.. ఒక్కరూ బయటికి రారే, ఏవయింది మీ అందరికీ?" అంటూ ఇంట్లోకి వచ్చాడు ఎదురింటి ఈశ్వర్.

అతనన్నదేమీ వినబడని అనంత్ "గుడ్‌మార్నింగ్, ఈశ్వర్ గారూ! ఏవిటివ్వాళ ఇంత ఎర్లీ మార్నింగ్, మా ఇంటికొచ్చారు? మీ ఆవిడ.. రోజాగారు ఊళ్లో లేరా ఏంటి! అంతే అయ్యుంటుంది అందుకే కాఫీ కాచుకోలేక వచ్చుంటారు" అంటూ నవ్వాడు అనంత్.

"ఇదేవిటి! మీ ఇంట్లో వాళ్లందరికీ కొత్తగా చెముడు పట్టుకుంది? ఇంతలా ఇల్లెగిరిపోయేలా ఈ టీవీ సౌండ్ ఏమిటి, వామ్మోయ్! నేనొక్క క్షణం కూడా ఇక్కడ ఉండలేను. ఇంకాసేపుంటే నా చెవిలో కర్ణభేరి పేలిపోయేలా ఉంది. బాబోయ్.. నే వెళ్తున్నా" అంటూ అక్కడినుండి పరుగున పారిపోయాడు ఈశ్వర్.

అనంత్ ఒక అనుమానపు పక్షి. పొద్దున్న లేచింది మొదలు పడుకోబోయే వరకు ఏ చిన్న పని చేయాలన్నా ఎన్నో చూసుకుని మరీ చేస్తాడు. అందుకు తోడు ఇప్పుడొక కొత్త సమస్య వచ్చిపడింది. ఈమధ్యే ఆఫీసులో హౌజింగ్ లోన్ తీసుకుని ఇల్లు కట్టుకుని కొత్తింట్లోకి వచ్చారు. మూడు గదులను ఓ పోర్షన్‌లా చేసి వేరే వాళ్లకు అద్దెకిచ్చారు. రెంటొస్తే కొంత లోన్ అయినా కట్టుకోవచ్చు.. భారం తగ్గుతుంది కదాని. ఇంట్లోని గదులే కావడం వల్ల వాళ్లింట్లో ఏమాత్రం చప్పుడయినా వీరికి వినబడుతూ ఉంటుంది. ఆఖరికి వాళ్లింట్లో ఎవరన్నా తుమ్మినా, దగ్గినా కూడా. వచ్చిన సమస్యల్లా తుమ్ములవల్లే!

ఆ పోర్షన్లో వుండే పాపారావ్ తెల్లవారింది మొదలు ఆపకుండా అరవయ్యారు తుమ్ములయినా తుమ్మందే ఊరుకోడు. అసలే అనుమానం మనిషయిన అనంత్ ఏ పని చేయాలన్నా పక్కింటి పాపారావ్ తుమ్ము వినబడిందని, కాసేపాగి ఆ పని చేయడం మొదలెట్టాడు. ఇలా చేసే ప్రతిపనీ ఆలస్యం అయిపోయి ఆఫీసుకు చాలా లేటుగా వెళ్లిన అనంత్‌కు పై ఆఫీసర్ చివాట్లు ఎదురయ్యాయి. ఇలా రోజూ ఆలస్యం అవడంతో ఓరోజు ఆఫీసర్ పిలిచి "రేపటినుండి ఇలా అయితే మాత్రం హాఫ్‌డే శాలరీ కట్ చేస్తాను జాగ్రత్త" అంటూ స్ట్రిక్ట్ వార్నింగ్ ఇచ్చాడు.

మరి పాపారావ్ తుమ్ములు వినబడకుండా ఏం చేయాలబ్బా... అని బాగా ఆలోచించగా ఇదిగో ఇలా టీవీ సౌండ్ పెద్దగా పెట్టి తుమ్ములను వినబడకుండా చేశాడే గానీ దీని మూలంగా ఇంట్లో వాళ్లందరికీ ఇబ్బంది కలిగిస్తూ తన పనులు మాత్రం పూర్తి చేసుకుని ఆఫీసుకు వెళ్తున్నాడు.

***

ఓరోజు... రోజులానే పొద్దున్నే టీవీసౌండ్ పెద్దగా పెట్టి పనులు చేసుకోసాగాడు అనంత్. అంటే వెంటనే కరెంట్ పోయింది. ఇక మళ్లీ పాపారావ్ తుమ్ముల హోరు చెవులు పేలిపోయేలా వినబడుతున్నయ్. అనంత్ పనులన్నీ వాయిదా పడిపోతున్నాయ్. ఆఫీసుకు లేటయి పోతుందేమోనని కంగారు పట్టుకుంది. ఆఫీసర్ కోపిష్టి మొహం గుర్తుకు వచ్చేసరికి పాపారావ్ మీద చెప్పలేని కోపం వచ్చింది. అందుకే ఆగకుండా పక్క పోర్షన్‌లోకి వచ్చేశాడు.

ముందు గదిలోనే కూర్చుని ఉన్న వర్ధనమ్మ పాపారావ్ తల్లి అనంత్‌ను చూస్తూనే.

"ఏవిటి బాబూ! ఇలా వచ్చావ్? రా! కూర్చో" అంటూ మర్యాద చేయబోయింది.

"నేను కూచోవడానికీ, మీతో మర్యాదలు చేయించుకోవడానికీ రాలేదు. మీరు వెంటనే ఇల్లు ఖాళీ చేయాలి. అది చెప్పడానికే వచ్చాను. ఏడీ మీ అబ్బాయెక్కడా?" అన్నారు ముఖమంతా కందగడ్డలా చేసుకుని కోపంగా.

"మేమేం చేశాం! వచ్చి నెలన్నా కాలేదు.. ఇలా ఉన్నఫళంగా ఇల్లు ఖాళీ చేయమంటే ఎలా, ఇదెక్కడి న్యాయం?" అంది కాస్త కోపంగా.

"న్యాయాన్యాయాల ప్రసక్తి అనవసరం, మేం ఇంట్లో ఏ పని మొదలు పెడదామన్నా శుభమంటూ... మీ అబ్బాయి తుమ్ములతో ఛస్తున్నా, అవి మీరు ఆపగలరా, ఆపలేరు. అందుకే ఇల్లు ఖాళీ చెయ్యమంటున్నా" అన్నాడు మరింత కోపంగా.

"ఇదెక్కడి చోద్యం? వచ్చే తుమ్ములను ఎవరు ఆపగలరు నీ పిచ్చిగానీ! అయినా మా వాడికి ఎలర్జీ అని డాక్టరు చెప్పాడు. ఇంత పెద్దదాన్ని నేనే వాటిని పట్టించుకోవడం లేదు. ఈ వయసులో నీకిదేం చాదస్తం? దుమ్ముకూ, ధూళికీ, జలుబుతో... ఆఖరికి కూరల్లో పోపు వేసే ఘాటుకూ వచ్చే తుమ్ములను కూడా ఎవరైనా పట్టించుకుంటారా... మేం వెళ్లిపోతే మాత్రం మళ్లీ వచ్చేవారు తుమ్మరని గ్యారెంటీ ఏమిటి?" అంటూ దీర్ఘాల మీద దీర్ఘాలు తీస్తూనే ఉంది వర్ధనమ్మ.

"అవునుకదా! వీళ్లు ఖాళీ చేసినా మళ్లీ వచ్చే వాళ్లు తుమ్మరని గ్యారెంటీ ఏమిటి? అయినా తుమ్ములు రానిమనిషెక్కడుంటాడు? నా పిచ్చి కాకపోతే ఆ పెద్దావిడ అన్నాకగానీ మనిషికి ఎన్నో కారణాలవల్ల తుమ్ములు వస్తాయనేది బోధపడలేదు" అనుకున్న ఆనంద్ పులిలా పక్కింట్లోకెళ్లిన వాడల్లా పిల్లిలా తిరిగి ఇంట్లోకి వచ్చేశాడు.

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు
న్యాయ సంబంధమైన
ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం
చేయాలో పాలుపోక
సతమతమవుతున్నారా? అయితే వెంటనే
ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి.
న్యాయవాది
శ్రీ జి.ఎల్.నరసింహారావు
తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.
మా చిరునామా:
ప్రజాశక్తి ఆదివారం అనుబంధం,
ఫ్లాట్ నెంబర్: 1,
అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

ఆస్తి ఆమెకు చెందే అవకాశముందా?

లాయర్‌గారూ, మాకు, మా బాబాయిగారికి కలిపి తాతలనాటి ఆస్తి 13 ఎకరాలు పొలముంది. మా బాబాయి తన భార్యకు గతంలోనే విడాకులు ఇచ్చాడు. అప్పుడావిడ తన తల్లి గారింటికి వెళ్ళి మళ్ళీ రానందున బాబాయి సబ్‌కోర్టులో విడాకుల దావావేశాడు. ఆమె కోర్టు సమను అందుకుని కూడా కోర్టుకు హాజరు కానందున కోర్టు 'ఎక్స్‌పార్టీ' విడాకులు మంజూరు చేసింది. ఈ మధ్యన మా బాబాయిగారు కాలం చేశారు. వారికి పిల్లలు లేరు. మా బాబాయిగారి మాజీ భార్య ఆయన ఆస్తికి ఆశపడి 'నేను భార్యను గనుక నాకే చెందుతుంది' అని పంచాయితీ పెట్టింది. విడాకులు మంజూరయ్యాయని మేం చెబితే తను కోర్టు కెళ్లింది. మళ్లీ విడాకుల పిటిషన్‌తో కేసు వేసింది. మా బాబాయి చనిపోయాక అలా వేయడం చెల్లుతుందా? ఇప్పుడు బాబాయి ఆస్తి ఆమెకు చెందే అవకాశముందా?

కిరణ్, నెల్లూరు.

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది
9848994240

ఆమె పరోక్షంలో విడాకులు అయ్యిందంటున్నారు కాబట్టి ఆమె అప్లికేషన్ పరిశీలించి గతంలో ఇచ్చిన ఎక్స్‌పార్టీ డిక్రీని రద్దు చేయవచ్చు. ఆమె వివరించిన కారణాలు స్పష్టంగా నిజమైనవి అనిపిస్తే మాత్రం కోర్టుకు అధికారం ఉంటుంది. అలా కోర్టు నమ్మి భార్యగా గుర్తిస్తే ఆమె హక్కులు ఆమెకు ఉంటాయి.





ఇంటి సంగతులు

ఇంద్రగంటి జానకీబాల

వంటూవార్పూ

విజయకు ఈమధ్య కాలంలో టీవీలో వంటలు చూడడం చాలా ముఖ్యమైపోయింది. అవి చూస్తున్నంతసేపూ మహా ఉత్సాహంగా అనిపిస్తుందామెకు. కొత్త వంటలు నేర్చుకోవడం కంటే, ఆ వంటల కార్యక్రమంలో ఉపయోగించే పాత్రలను చూడడం ఆమెకు చాలా ఇష్టం. అవన్నీ శుభ్రంగా, కొత్తగా ఉంటాయి. తళతళ మెరుస్తూ బాండ్లీ.. దానికి సరిగ్గా సరిపోయే మూత. గాజు గిన్నెల్లో సిద్ధంగా పెట్టుకున్న దినుసులు, గాజుజార్‌లోంచి వంపుతున్న నూనె, స్టయిల్‌గా ఉండే గరిట, అసలు వాడనట్లుగా కొత్తగా ఉండే స్టవ్... చూస్తుంటే విజయకు అదేదో వేరేలోకం అనిపిస్తుంది. ఇవన్నీ ఒక ఎత్తు, ఆ వంటలు చేయడానికొచ్చేవారు మరొకెత్తు. కొత్తకొత్త వంటలు పరిచయం చేసేవారందరూ అసాధారణమైన స్థూలకాయంతో ఉండటం చూసి 'ఈ కొత్త వంటలన్నీ రుచి చూసీచూసీ వీళ్ళీవిధంగా తయారయ్యారా?' అని విజయ నవ్వుకుంటుంది. కానీ ఆమెకు అలా టీవీలో కనిపించాలనీ, అక్కడ ఒక వంటకమైనా చేయ్యాలనీ మహా ఉబలాటంగా ఉంటుంది. వాళ్లు చెప్పినట్లు వంటలు రాసి పంపినా ఛాన్సు తగల్లేదు. మరో ముఖ్య విషయమేమంటే విజయకు వారు ధరించే దుస్తులు, పెట్టుకునే నగలు, చేసుకునే అలంకరణ చూస్తుంటే కార్యక్రమంమీద మహామోజుగా ఉంటుంది. తళతళ మెరిసిపోయే చీరకు మ్యాచింగ్‌బ్లౌజు వేసుకుంటారు. ఇంట్లో అయితే సిల్కుబట్టలు ధరించవద్దని రూలు. వంటపనికి కాటన్ చీరే కట్టుకోవాలి. కానీ ఇది లక్షలమంది చూస్తారు కదా! అందుకే ఈ ఆర్భాటం. వాళ్లకున్న నగలన్నీ మెళ్లో వేసుకుంటారు. నల్లపూసలు, పగడాలు, ముత్యాలు, గొలుసులు, నెక్లెస్సులు.. మోచేతుల వరకు బంగారు, మట్టి, రాళ్లగాజులు.. ఇలా రకరకాల గాజులు, చివరిగా చెప్పుకోవాల్సినవి – అన్ని వేళ్లకీ ఉంగరాలు తప్పనిసరి. ఎందుకంటే మంట సమయంలో ముఖ్యంగా కనిపించేవి చేతివేళ్ళే కదా! పిండి కలుపుతున్నా ఆ ఉంగరాలన్నీ ఉండాల్సిందే... మరి కనిపించడానికే కదా పెట్టుకున్నది. ఒక్కొక్కసారి చాలా అసహజంగా చెంచాతో పిండి కలిపే ప్రయత్నం చేస్తూ స్టైల్‌గా చూపిస్తారు. కుదరనప్పుడు చేత్తోనే కలుపుతారు. ఇంక ఏ కొత్త వంటకమైనా–

ఉల్లితరుగు, పచ్చిమిర్చిముక్కలు, అల్లం వెల్లుల్లిపేస్టు, ధనియాల పొడి, జీలకర్రపొడి, టొమేటో, కొత్తిమీర కారం, నూనె, ఆవాలు, మినపప్పు, జీలకర్ర, జీడిపప్పు, తగినంత ఉప్పు, చింతపండు పులుసు, కాస్తంత పంచదార, నాలుగు లవంగాలు, ఏలకులు అంటూ ఈ ప్రపంచంలో ఉన్న సరుకులన్నీ వంటలో వాడతారు.

టీవీలో కనిపిస్తున్న సరుకుల గాజుగిన్నెలు సుమారు ఒక ఇరవైవరకూ ఉన్నాయి. విజయ ఆశగా చూస్తోంది. 'అరటిపళ్లమలై' అని ఒక వంట మొదలెట్టారు వంటపిన్నిగారు.

కొంచెం వాటర్‌వేసి, ఫ్రై చేసి, ఆయిల్ వేసి, పేస్టువేసి, మిక్స్‌చేసి సాల్టు, ఆనియన్ ముక్కలువేసి అంటూ వచ్చీరాని ఇంగ్లీషులో.. తెలుగుమాట చెప్పాల్సివచ్చినప్పుడు కాస్తంత అవమానంగా ముఖంపెడుతూ మొత్తానికి ఆ వంట పూర్తిచేసింది వంటపిన్నిగారు.

అది స్వీటో, హాటో చెప్పడం ఎవ్వరితరమూ కాదుగానీ పాపం యాంకర్ పాపాయి మాత్రం చెంచాతో తీసి నోట్లో వేసుకుని కళ్లెగరేసి "ఛాలా బాగుందండీ" అంటూ అభినందించింది.

ఆ వంటకత్తె సిగ్గుపడుతూ నమస్కరించింది. 'ఇంతమంచి వంటకాన్ని మా ప్రేక్షకులకు చేసిచూపి మమ్మల్ని తరింపజేసినందుకు మీకు కృతజ్ఞతలండీ, మీరు మాకోసం ఈ కార్యక్రమం చేసినందుకు మీకో చిన్న గిఫ్ట్" అంటూ ఒక హ్యాండ్‌బ్యాగ్ అందించింది. ఆ బ్యాగ్ చూశాక విజయ మనసు విలవిల్లాడిపోయింది. ఎన్నాళ్లుగానో అలాంటి ఒక బ్యాగ్ కొనుక్కోవాలని తపించిపోతోంది. కుదరలేదు! అది కాస్త ఖరీదైన బ్యాగే– ఎప్పుడూ వుండే డబ్బులెక్కలవల్ల కుదరలేదు.

ఎలాగైనా టీవీ వంటల్లో స్థానం సంపాదించుకోవాలి. లేకపోతే జీవితం వృథా అనుకుంది.

సాధారణంగా ఆ మధ్యాహ్నం టీవీలో చూసిన వంటకమే సాయంత్రం భర్త, పిల్లలు వచ్చేసరికి టిఫినుగా, టేబులు మీద ప్రత్యక్షమవుతుంది.

ఆవేళా ఆ ప్రయోగం చేసినప్పటికీ తింటారో లేదోనని విజయ కాస్త జంకింది. తిరిగి ఉప్మా చెయ్యడానికి అన్నీ సిద్ధంగా పెట్టుకుంది. అనుకున్నంతా అయింది. ఒక్కరూ ఆ అరటిపళ్లపేస్టు ముట్టుకోలేదు. హడావిడిగా ఉప్మాచేసి పెట్టేసింది. భర్త మాట్లాడకుండా ఊరుకున్నా, పిల్లలు ధ్వజమెత్తారు.

"నువ్విక టీవీలో చూపించిన వంటలు చేస్తే ఊరుకోం" అంటూ గొడవచేశారు.

విజయ ఒక నిర్ణయానికొచ్చింది. 'ఇంక ముందు టీవీలో చూసిన వంటకాలు చెయ్యడం మానేసి, తనకొచ్చిన వంటలు ఒక్కొక్కటీ రాసి పంపాలి. కనీసం ఒక్కసారైనా వంటచేస్తూ టీవీలో కనిపించాలి. అవకాశం వచ్చేవరకూ ప్రయత్నించాలి. అలాగైతేగానీ ముప్ఫైఏళ్లుగా ఇంట్లో చేస్తున్న ఈ వంటపనికి సార్థకతలేదు' అని గట్టిగా అనుకుంది విజయ.

ఇలా వుందామా...

మొలకలపల్లి కోటేశ్వరరావు

అంత అవసరమా?!

"ఏమండీ, పార్వతి మొన్న నాలుగు గాజులు చేయించుకుందండీ. చాలా బాగున్నాయి. నేనూ రెండు గాజులు చేయించుకుంటానండీ" ముద్దులు వొలకబోస్తూ, భర్తను అడిగింది సత్యవతి.

"పార్వతి భర్తంటే టీచర్. వాళ్లకు డబ్బులున్నాయి. నెలనెలా జీతాలు వస్తాయి. నాలుగు కాదు, పది గాజులైనా చేయించుకుంటారు. వాళ్ళకీ మనకీ ఎక్కడ కుదురుతుంది చెప్పు సత్యా"

"ఆమెకు ఇద్దరు కొడుకులు. మనకు ఇద్దరు కూతుళ్లు. రేపు మన పిల్లలు పెద్దైన తరువాతైనా ఉపయోగపడతాయి కదండీ!"



"నిజమే, ఏం చేద్దాం? ఇప్పటికే మనకి చాలా అప్పులున్నాయి. ఉన్న ఆస్తితో పోలిస్తే ఈ అప్పులు లెక్కలోనివి కాదనుకో. ఇప్పుడు నువ్వు గాజులు చేయించుకోవాలంటే తిరిగి అప్పు చేయాల్సిందే"

"అయితే ఏంటండీ? బంగారం రేట్లు రోజురోజుకీ పెరిగి పోతున్నాయి. ముందుముందు మనం కొనలేం. పెళ్ళియ్యి ఇన్నేళ్ళయినా తులం బంగారం చేయించలేదు మీరు నాకు. అప్పోసప్పో రెండు గాజులు చేయించండీ"

"సరే, అలాగే చేయించుకుందువులే"

"ఎప్పుడు చేయిస్తారు? రేపు మన పెళ్ళిరోజుకి చేయించాలి"

"ఇప్పటికిప్పుడు చేయిం చాలంటే ఇబ్బంది కదూ సత్యా. ముందు అప్పు దొరకాలి కదా! ప్రయత్నిద్దాం.. ఇచ్చేవాళ్ళుండాలిగా"

"మీకాశ్రమలేదండీ. నేను మాట్లాడి పెట్టాను. మా ఫ్రెండ్ రాధలేదూ... దాని మొగుడు వడ్డీకి డబ్బు ఇస్తుంటాడు. మొన్న నేనడిగితే కావాల్సినంత డబ్బు తీసుకుపొమ్మని చెప్పింది అది. తరువాత డబ్బు కావాలన్నావు కదా వచ్చి తీసుకుపొమ్మని ఫోన్లోనూ అడిగింది"

"వడ్డీ ఎంతేమిటి?"

"రెండు రూపాయల వడ్డీకే ఇస్తామన్నారండీ. అందరి దగ్గరా ఇంకా ఎక్కువ తీసుకుంటారట"

"సరే, రేపు వెళ్ళి డబ్బు మాట్లాడు. ఇస్తానంటే డబ్బు తీసుకొచ్చి తెచ్చుకుందువు. నీ కోరిక నేనెందుకు కాదనాలి" అన్నాడు భర్త విజయ్.

మరుసటిరోజు ఉదయమే సత్యవతి దంపతులు వెళ్ళి, రాధ దగ్గర 20వేల రూపాయలు తీసుకున్నారు. రెండు రూపాయల వడ్డీకి నోటు రాశారు. అప్పటికప్పుడే జ్యువెలర్స్ షాపుకెళ్ళి, ఒక్కోటి పది గ్రాములు బరువున్న రెండు గాజులు కొనుగోలు చేసి తెచ్చుకుంది సత్యవతి. అప్పటికే వాళ్లకి చాలా అప్పులున్నాయి. తరువాత నెల రోజులకి విజయ్‌కి ఏదో అవసరమై సత్యవతి కొన్న రెండుగాజులు తీసికెళ్ళి బ్యాంకులో కుదవపెట్టి లోన్‌తెచ్చుకున్నాడు. అంతకుముందు సత్యవతికి పుట్టింటివాళ్ళు పెట్టిన బంగారమూ బ్యాంకులోనే మూలుగుతోంది.

కొత్తగా చేయించుకున్న గాజులకి అటు బ్యాంక్‌లోనూ, ఇటు రాధ భర్త వద్ద రెండు వైపులా వడ్డీపడుతోంది. వడ్డీకి ప్రతి ఉదయమూ శుభోదయమే! దిన దినాభివృద్ధి దాని స్వభావం. సత్యవతి, విజయ్ దంపతులకి అప్పు చేయడం అంటే లెక్కలోని విషయంకాదు. ఎవరైనా అప్పు ఇస్తామంటే చెప్పుకోదగ్గ అవసరం లేకున్నా ఎగిరి గంతేసి తెచ్చుకుంటారు.

సరే, వాళ్ళ సంసారపు సాగుసు ఇలా వుంటే... అదే వీధిలో నివసిస్తోన్న శాంతీ ప్రసాద్‌ల కాపురమూ డిటోనే! వాళ్ళిద్దరి ఆలోచన్లూ విభిన్నంగా ఉన్నా... అప్పు చేసే విషయంలో ఏకాభిప్రాయంతో ఉంటారు. ఉత్సాహంగా దొరికిన కాడికి దొరికినంత తెచ్చుకుంటారు. అలా అప్పులు చేసే కలర్ టీవీ, మిక్సీ, గ్రైండర్, ఫ్రిజ్, కూలర్ లాంటి వస్తువులు సమకూర్చుకున్నారు. అవసరమైన వస్తువులేగాక, అప్పులు చేస్తూ విలాస జీవితం గడపడం అలవరచుకున్నారు.

'అప్పు చేసి పప్పుకూడు' అనే సామెత అందరికీ తెల్సిందే. అప్పుచేసి విందారగిస్తే తరువాత తిప్పలు తప్పవు అనే అర్థంలో ఆ సామెతని ప్రయోగించేవాళ్ళు వెనుకటి రోజుల్లో. అప్పు చేస్తే పెనుముప్పు దాని వెనుకనే పొంచి వుంటుంది. వ్యక్తులకైనా, కుటుంబాలకైనా, ప్రభుత్వాలకైనా! అప్పుల కారణంగా కుంటుంబాలు తక్షణం సంకోభంలో పడిపోతే, ప్రభుత్వాలకు ఆ స్థితి రావడానికి కొంత సమయం పడుతుంది, నేటి లాటిన్ అమెరికా దేశాల మాదిరిగా!

కుటుంబం అంటే ప్రభుత్వం కాదు గదా, ఇస్తామన్న వాళ్ళ దగ్గరికి పరిగెత్తుకు వెళ్ళి, అప్పులు తెచ్చుకోవడానికి... ఆనక తమ కమీషన్లు తాము పుచ్చుకుని, స్విస్ బ్యాంకుల్లో దాచుకోవడానికి. వాటిని తిరిగి చెల్లించడానికి ప్రతి వస్తువుమీదా ఎడాపెడా పన్నులు వసూలుచేసి వడ్డీలు చెల్లించడానికి! ప్రభుత్వానికి ప్రజలున్నారు వడ్డీలు చెల్లించడానికీ, వాతలు పెట్టించుకోవడానికీ! కుంటుంబాలకు ఎవరుంటారు?



అప్పులు చేసేవాళ్ళు మూడు విషయాలు ఎదుర్కోవాల్సి వుంటుంది. తమ సంపదనూ లేదా శ్రమ శక్తిని వడ్డీల రూపంలో చెల్లించడమూ, స్థాయికి మించిన అప్పులైన తరువాత చెల్లించలేక ఎగనామంపెట్టి, వాళ్లతో తిట్లు తినడం! ఈ రెండూ కాకుంటే ఇవాళ దేశంలోని వేలాదిమంది రైతుల్లా ఆత్మహత్యలతో తనువు చాలించుకోవడమూ!

సత్యవతి, విజయ్ దంపతులు అప్పులు పెరిగి వాళ్ళ తండ్రులూ తాతలూ సంపాదించిన స్థిరాస్తుల్ని అమ్ముకుని బాకీలు చెల్లించి చితికిపోయారు. శాంతీప్రసాద్ దంపతులు బాకీల వాళ్ళకి పంగనామాలు పెట్టి అర్థరాత్రి ఊరు విడిచి దేశాలమీదకి దొంగల్లా పారిపోయారు.

సో, వీలైనంతవరకూ అప్పులు చేయకుండా వుండటమే మంచి లక్షణం. అప్పు మరీ అవసరమా? తప్పనిసరి పరిస్థితిలో చేయాల్సివస్తే ఒకటికి నాలుగుసార్లు ఆలోచించుకుని, ఆర్థికస్థితిని సమీక్షించుకుని జాగ్రత్తగా ఆ ఊబిలో దిగాలి. దీన్నెవరైనా కాదనగలరా?!

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

జరిగిన కథ

ఇద్దరు వ్యక్తులు కొండ పక్కగా ఎక్కిరావడం చూసిన ప్రతాప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రమీల ఆలోచనలో పడ్డారు. మొదట రజాకార్లేమోనని ఆలోచించారు. చివరికి వాళ్ళను బ్రహ్మారెడ్డి, పెంటయ్యలుగానిర్ధారించుకుని తేలికపడ్డారు.

(46వ భాగం)

తెలుగుగడ్డ

"ఇప్పుడు వాళ్లెక్కడున్నారు?" అనడిగాడు ప్రతాప్.

"వెనుక వస్తున్నారు. నెమ్మదిగా నడుస్తుంటేను మనవారిని ఒకరిని వారికి తోడిచ్చి నేను మిగతావారితో ముందుగా వచ్చాను" అన్నాడు యాదవ.

ఇంకొక నాలుగు నిమిషాల్లో బ్రహ్మారెడ్డి, పెంటయ్య ఇద్దరూ కొండనెత్తికి చేరుకున్నారు. ప్రతాప్‌రెడ్డి వారికెదురుగా వెళ్లి ఆహ్వానించాడు. వారిద్దరినీ వెంటబెట్టుకుని బూరుగుచెట్టు వద్దకు వచ్చాడు. తర్వాత అందరూ ఆసీనులయ్యారు.

"అంతా బాగున్నారా బ్రహ్మారెడ్డి మావయ్యా?" అనడిగాడు ప్రతాప్‌రెడ్డి.

బ్రహ్మారెడ్డి తలూపాడు. "మీకు తెలియని బాగోగులేమున్నాయి నాయనా? అటు చావలేకా, ఇటు బతకలేకా ఉన్నాం. యాదవ తల్లి ఇంతవరకూ ఇల్లు చేరలేదు. అంతా నిర్మానుష్యంగా ఉంది. అన్నట్లు ఈమధ్య విశేషాలేమీ మీకు తెలియవా?" అన్నాడు.

"మాకేమీ తెలియవు. మొన్న రాత్రికే ఈ కొండలకు వచ్చింది" అన్నాడు ప్రతాప్.

"అట్లాగా ఇన్ని దినాల నుండి ఎక్కడున్నారు?" అన్నాడు బ్రహ్మారెడ్డి.

"పడమర జిల్లాలన్నీ తిరిగొచ్చాం. అదీగాక మన తాలూకాలో రజాకార్ల దోపిడీలు ఎక్కువవుతున్నాయని విని వచ్చాం" అన్నాడు ప్రతాప్‌రెడ్డి.

బ్రహ్మారెడ్డి తలూపాడు. "మీరీ ప్రాంతం వదిలిపెట్టిపోవడంతో రజాకార్ల ఆటలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. వాళ్లు పెట్టే కష్టాలు ఎన్నని చెప్పను? ఒకటా రెండా?" అన్నాడు

"మన గ్రామానికి కూడా రజాకార్లు వచ్చిపోతున్నారా?" అనడిగాడు ప్రతాప్ నొసలు చిట్లిస్తూ.

"ఇప్పుడు రజాకార్లు, మిలట్రీ అంతా మన గ్రామంలోనే క్యాంపు వేసుకుని కూర్చున్నారు. ప్రతిదినం మా వీపులన్నీ పగిలిపోతున్నాయి. ఆ పటేలు మమ్మల్నందరినీ ఏదో ఒక వంకతో చావబాదిస్తున్నాడు. చూడు నాయనా నా వీపు" అంటూ బ్రహ్మారెడ్డి వీపుపైఉన్న చొక్కాను తొలగించాడు. అతడివీపు అంతా బెత్తెడు మందాన తాటలు లేచి కనిపించింది.

అది చూసి అందరూ నిర్ఘాంతపోయారు. ప్రతాప్‌రెడ్డి నిట్టూర్చాడు. "క్షమించు బ్రహ్మారెడ్డి మావయ్యా... మీరు పడిన బాధలన్నీ మా వల్లనే జరిగినవని బాధపడుతున్నాను. అసలు ఈ ప్రాంతాన్ని వదిలివెళ్లడం మాది పూర్తిగా పొరపాటైపోయింది" అన్నాడు.

"అన్నట్టు అసలు విషయాన్ని చెప్పటమే మరచిపోయాను. మీ మామయ్య కోదండరాంరెడ్డిని చావుదెబ్బలు కొట్టి చెరువుగట్టున పండబెట్టి వచ్చారు. ఆరాత్రే నీ భార్య, రంగనాయకమ్మక్క పరారీ అయిపోయారు. తెల్లవారిన తర్వాత మీ ఇంట్లో పాతరలో ఛోటామియా శవం దొరికింది..." అన్నాడు బ్రహ్మారెడ్డి.

మధ్యనే ఆదుర్దాగా అందుకున్నాడు ప్రతాప్‌రెడ్డి,

"ఛోటామియా చచ్చాడా? అయితే అతడి శవం మా ఇంట్లో దొరకడం ఏమిటీ" అనడిగాడు.

"అంతా విచిత్రంగా ఉంది. మాకు మాత్రం ఏం తెలుసును? శవం తలమీద గొడ్డలిదెబ్బలున్నాయట" అన్నాడు బ్రహ్మారెడ్డి.

గొడ్డలిమాట వచ్చేసరికల్లా ప్రతాప్‌రెడ్డి మెదడులో తనకారోజున ఏసురత్నం గొడ్డలి నరిపించుకుని వచ్చి ఇచ్చినప్పటి విషయం గుర్తుకొచ్చింది. ఆ సమయంలో తాను అన్న మాటలు గుర్తుకొచ్చినయ్. తాను అన్నమాట ప్రకారం ఆ గొడ్డలి దెబ్బతోనే ఛోటామియా చచ్చిపోయాడని నిర్ణయించుకున్నాడు. ఆ మరుక్షణమే అతడు చిరుమందహాసం గావించాడు.

అంతలోనే అతడి ముఖం విచారంతో ముడుచుకునిపోయింది. "ఇప్పుడు మా మావయ్య ఎక్కడున్నదీ మీకేమయినా తెలుసా?" అనడిగాడతను.

"తెలియదు. చెరువు దగ్గరనుండి ఎట్లాగో బాధపడి తోటలోకి చేరుకున్నాడట. ఆ మరునాడు సాయంత్రం ఇల్లు తగులబడిపోయేవరకు అక్కడే ఉన్నాడని తెలిసింది..."

"మీ డాబాయే నాయనా, కిరసనాయిలుపోసి నిప్పు ముట్టించారు.

దాబా అంతా కూలిపోయింది"

ప్రతాప్‌రెడ్డి బూరుగు వృక్షం ఆకుల్లోకి చూస్తూ భారంగా నిట్టూర్చాడు. యాదవరెడ్డి కలిగించుకుని మాట్లాడాడు. "ప్రతాప్, మనమింకా చూస్తూ ఊరుకోడానికి వీల్లేదు. వీళ్ళ దురాగతాలు అంతులేకుండా సాగిపోతున్నాయి. ఈ రాత్రికే పోయి వాళ్ల క్యాంపుమీదపడి ఊచకోత కోసివద్దాం" అన్నాడతను ఆవేశంతో.

"యాదవా, తొందరపడుతున్నవు" అన్న మాటలు ప్రతాప్‌రెడ్డి నోటినుండి గంభీరంగా వినవచ్చాయి.

"ప్రతాప్ మనల్ని నమ్ముకున్న వారందరూ రాక్షసుల అత్యాచారాలకు గురయి సర్వనాశనం అయిపోతున్నారు. ఇంకా తొందరపడకపోవడం ఏమిటీ? దెబ్బకు దెబ్బ... నెత్తురుకు నెత్తురు ప్రతీకారం చూడవలసిందే" అన్నాడు యాదవరెడ్డి.

"యాదవా!" అంటూ అరిచాడు ప్రతాప్‌రెడ్డి. "నిన్ను నీవు తెలుసుకునే మాట్లాడుతున్నావా? నీవు చెప్పినట్లుగా చేస్తే మనకూ, రజాకార్లకూ తేడా ఏమిటంటావు?" అన్నాడు తిరిగి.

అతడలా మందలించేసరికి యాదవరెడ్డి రోషంతో ఇంకోవైపుకు ముఖం తిప్పుకుని కూర్చున్నాడు. ప్రమీలాదేవి కలిగించుకుంది. "ప్రతాప్‌రెడ్డీ, ప్రతీకార దృష్టితో కాకపోయినా మన ప్రాణరక్షణ కోసమయినా వాళ్లతో మనం తలపడక తప్పదుగా?" అంది.

"దానికి నేను కాదంటున్నానా ప్రమీలాదేవీ? సోదరీసోదరుల మానప్రాణాల రక్షణ కొరకు మనందరి ప్రాణాలనూ ఎదురొడ్డి పోరాడుదాం" అన్నాడు ప్రతాప్‌రెడ్డి.

అప్పటివరకూ మౌనంగా వింటూ కూర్చున్న పెద్దమాదిగ పెంటయ్య కలిగించుకున్నాడు. "ఇప్పుడు మా మానం ప్రాణం దక్కకనేకదా తమరి దగ్గరికొచ్చాం. ఇకనయినా మీరు కలిగించుకోకపోతే ఆ గేమంలో బతకలేమయ్యా" అన్నాడు. ఒకవైపున జొన్నకోతకు వచ్చింది. దానికి కోసి కౌలు చేసుకుందామంటే ఈ రాక్షసులు కళ్ళానికెగబడి కోసుకుపోతారేమోనని భయమౌతోంది" అన్నాడు బ్రహ్మారెడ్డి.

"బ్రహ్మారెడ్డి మావయ్యా, ఇకనుంచి మీకు ఎలాంటి బాధలూ కలుగనివ్వం. రజాకార్లకు మీరు భయపడవలసిన పనిలేకుండా చేస్తాం. ఒకటిరెండు రోజులు ఓపిక పట్టండి. రజాకార్లు, మిలిట్రీ అంతా మన గ్రామం వదలి పారిపోయేట్లు చేస్తాం. సరేనా?" అన్నాడు ప్రతాప్‌రెడ్డి.

"మాకు కావలసింది అదే నాయనా. తిన్న తిండి వంటబట్టకుండా ఛస్తున్నాం" అన్నాడు బ్రహ్మారెడ్డి.

"ప్రతాపయ్యగారూ! తమరాపని చేశారంటే హాయిగా బతుకుతాం, కడుపుల్లోకి కూడున్నా, లేకపోయినా నీలూ, నిట్రా తాగి బతుకుతాం" అన్నాడు పెంటయ్య.

ప్రతాప్ నవ్వాడు. "మా ప్రాణాలుండగా మీరు బాధలు పడవలసిన పనిలేదు. పెంటయ్యా, రజాకార్లు ఇప్పుడే గ్రామం వదిలి వెళ్లిపోయారని తలచండి" అన్నాడు.

"నీ కడుపు చల్లగా వర్ధిల్లాలి దొరా. మీ మాటలు వింటోంటే మా కష్టాలన్నీ గట్టెక్కినట్లే అనిపిస్తోంది" అన్నాడు పెంటయ్య.

ప్రతాప్ తిరిగి నవ్వుతూ సంభాషణను మార్చేశాడు. "పెంటయ్యా వాడవాళ్లంతా బాగున్నారా?" అనడిగాడు.

"ఏం బాగులే దొరా? ఏట్లో బాగు" అన్నాడు పెంటయ్య.

"సుందరం, అబ్బురాం మొదలయినవాళ్లంతా ఏం చేస్తున్నారు?"

"వెట్టి చేయలేక చస్తున్నారు. తన్నులు తినలేక చస్తున్నారు"

"అయితే పటేలుకు మళ్లీ వెట్టి చేస్తున్నారా?"

"చేయకపోతే బతకటం ఎట్లా? ఒక్కొక్కడి వీపు అరచేతి మందాన అట్టలు లేచినయ్"

ప్రతాప్ తలూపాడు. "పెంటయ్యా, విచారించకండి, మంచి రోజులు మనకు దగ్గర్లోనే ఉన్నాయి" అన్నాడు.

"అంతా ఆ పరమాత్ముడి దయ" అన్నాడు పెంటయ్య.

"పెంటయ్యా, రూబేను గురించి అడగడం మరిచాను. అతడి ప్రవర్తన ఎలా ఉంది?" అనడిగాడు ప్రతాప్.

"వాడికేం అయ్యా? మహారాజు మాదిరి తిరుగుతున్నాడు. వాడి కొడుకు ఏసోబుగాడు మా అందరి మీద వెట్టి చేయించడానికి మేస్త్రీ"

"అది సరే. రూబేను దొంగతనాల్లో, దోపిడీల్లో పాల్గొంటున్నాడని



విన్నాను. నిజమేనా?"

"నిజమే దొరా, మొన్నటిరాత్రి యానాదిగూడెం వాళ్లను వెంటేసుకుని దోపిడికి పోయాడని అనుకుంటున్నారు. ఈమధ్య వాడి జేబుల నిండా రూపాయల నోట్లు కూడా కనిపిస్తున్నాయ్. వాడికిప్పుడు పొద్దుకూకులు ఒకటే తాగుడు" అని చెబుతున్నాడు పెంటయ్య.

ఆ సమయంలోనే మల్లారెడ్డి వచ్చాడు. బ్రహ్మారెడ్డి, పెంటయ్యలిద్దరూ కనిపించేసరికి వారిని కుశల ప్రశ్నలు వేశాడు. తన ఇంటివద్ద తల్లిదండ్రుల క్షేమసమాచారాలు కనుక్కున్నాడు. చివరికి ప్రతాప్ సమీపంలోకి వచ్చి కూర్చున్నాడు.

ప్రతాప్ అతణ్ని "మల్లా, నీవెళ్లిన విషయం ఏమయింది?" అనడిగాడు.

"మన గ్రామంలో ఉన్న రజాకార్లు, యానాదిగూడెం వాళ్లు కలిసి దోపిడీ చేశారట ప్రతాప్"

"ఈ ఆచూకీ నీకెలా తెలిసింది?"

"స్వయంగా దేశముఖుతో మాట్లాడాను, ఆయనే ఈ విషయమంతా చెప్పాడు"

"నీవు సంగంలోని వాడివని దేశముఖుకు తెలుసా?"

"అతడికెలా తెల్సు? మారువేషంలో వెళ్లి మాట్లాడాను"

ప్రతాప్ తలూపాడు.

అప్పటికి కనుచీకటి పడుతోంది.

"సరే, అన్ని విషయాలు తర్వాత మాట్లాడుకుందాం. ఇప్పటికి లేవండి. అర్జునుడి కొండకు వెళ్లిపోదాం" అన్నాడు ప్రతాప్.

"దాంతో అందరూ లేచారు. సమీపంలోనే కనిపిస్తున్న అర్జునుడి కొండ వైపుకు బయల్దేరారు. వారి వెంట బ్రహ్మారెడ్డి, పెంటయ్యలిద్దరూ బయల్దేరారు.

అర్జునుడి కొండ నెత్తిన గుడ్డిదీపం ఒకటి వెలుగుతోంది. ఆ వెలుగును బట్టి అందరూ అక్కడికి చేరుకున్నారు. అప్పటివరకూ కునికిపాట్లు పడుతూ కూర్చున్న పెరుమాళ్లు లేచి నిల్చున్నాడు.

"మిగతావాళ్లెక్కడ ఉన్నారు పెరుమాళ్లు" అడిగాడు ప్రతాప్‌రెడ్డి.

"నీళ్లకోసం వెళ్లారు"

"ఇంత చీకటిలో యేటికి నీళ్లకెళ్లారా?"

"ఇప్పుడేగదా పెతాపయ్యా, వాళ్లు వెలగపండ్లు ఏరుకుని వచ్చారు"

తర్వాత ప్రతాప్, మిగతావారందరూ గుడ్డిదీపం వెలుగులో కూర్చున్నారు. పిచ్చాపాటి మొదలెట్టారు. ఎవరికి తోచినరీతిగా వారు సంభాషణలో పడిపోయారు. పది నిమిషాలు గడిచిపోయినయి.

నీళ్లకోసం వెళ్లిన ఆరుగురూ బిందెలు నెత్తిన పెట్టుకుని వచ్చారు. వారు వచ్చి బిందెలు దింపగానే కూర్చున్నవారందరూ లేచి కాళ్లూ చేతులూ కడుక్కుని రెండు వరుసలుగా తీర్చి భోజనానికి కూర్చున్నారు. పెరుమాళ్లు తీగమోదుల ఆకులను అందరిముందు పర్చుకుంటూ పోతున్నాడు. కొండయ్య, మంగయ్యలిద్దరూ వెలగపండ్ల ముక్కలు తెచ్చి చకచకా వడ్డించారు. అందరూ తలలు వంచుకుని తినేపనిలో నిమగ్నులయిపోయారు. కాసేపటికల్లా వారి భోజనాల కార్యక్రమం పూర్తయింది.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

కె శివలీల

ఇరిటేటింగ్...

నేను నిన్ను ప్రేమిస్తున్నాను...' అని ప్రేమించిన అమ్మాయితో నేరుగా విషయాన్ని చెప్పడం...

"వావ్... రియల్లీ డేరింగ్ అండ్ డాషింగ్..."

'రమ్యా... ఈ విషయం నీలూకు ఎలాగైనా నువ్వే చెప్పాలి...' అంటూ ఆమె స్నేహితురాలి సహాయం తీసుకోవడం...

"థర్డ్ పర్సన్ ఇన్వాల్వ్‌మెంట్... అయినా ఓకే..."

'నేను ఫలానా అమ్మాయిని ప్రేమిస్తున్నాను. ఆ అమ్మాయి పర్సనాలిటీ ఇలా ఉంటుంది. మేం సొ౦అండ్‌సొ ఏరియాలో ఉంటాం. అంటూ పేరుతో సహా పూర్తి వివరాలనందిస్తూ ఆమె తనతో డేటింగ్‌కు వస్తుందో లేదో, తనను ప్రేమిస్తుందో లేదో ఒక ఎఫ్.ఎం. ఛానల్ ద్వారా ఆన్‌లైన్‌లో తెలుసుకోవడం...?!'

"........."

అవును! ఈ విషయం విన్నవెంటనే చాలామంది విద్యార్థులు ఎటువంటి కామెంట్స్ చేయలేకపోయారు మరి. బిగ్‌ఎఫ్‌ఎమ్‌లో సోమవారం నుండి శుక్రవారం వరకు రాత్రి పదిగంటలకు వస్తున్న 'అడిక్టెడ్ టు అడోనిక' కార్యక్రమం యువతపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతోంది? కేవలం తను మాత్రమే తెలుసుకోవాల్సిన విషయాన్ని అదేసమయంలో లక్షలాదిమంది వింటున్నారంటే ఏ అమ్మాయైనా ఎలా ఫీలవుతుంది? ప్రేమ, డేటింగ్‌లాంటి వ్యక్తిగత విషయాల్ని ఇలా పబ్లిక్ ఇష్యూచేయడంపై, పలువురికి ఎంటర్‌టైన్‌మెంట్‌గా మార్చడంపై యువత స్పందన ఎలా ఉందో తెలుసుకుందామా...

'అతనితో డేటింగ్ చేయడం మీకిష్టమేనా? ఇందులో ఫోర్సేమీ లేదు... మీ సమాధానం ఎస్ అయితే మీ డేట్‌కి అరేంజ్‌మెంట్స్ మేమే చేస్తాం... నో అయితే మీకు మా తరఫునుంచి ఒక గిఫ్ట్ అందుతుంది... ఛాయిస్ మీదే...' అంటూ సాగుతున్న ఆర్జే మాటలు వింటుంటే మీకేమనిపిస్తుందోగానీ.. 'ఇరిటేటింగ్..' అని చాలామంది పెదవి విరిచారు.

"ప్రేమనేది పబ్లిక్ ఇష్యూనా? ఇటువంటి కార్యక్రమాల్ని బ్యాన్ చేయాలి..." అంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాలు అమ్మాయిల గౌరవాన్ని భంగపరిచేలా ఉన్నాయనీ, ఇలాంటివి కొనసాగడం సరైంది కాదనీ అంటున్న అమ్మాయిలతోపాటు, చాలామంది అబ్బాయిలూ ఏకీభవించారు. నేటి యువత మనోభావాలేంటో ఇంకా స్పష్టంగా తెలుసుకోవాలంటే...

"ఒక విధంగా చెప్పాలంటే... ఈ ప్రోగ్రాం వల్ల కొంత లాభమూ ఉందనే అనొచ్చు. ఎందుకంటే చాలామంది ఒకరినొకరు ఇష్టపడుతుంటారు... కానీ చెప్పడానికి భయపడే పొజిషన్‌లో ఉండొచ్చు. అలాంటప్పుడు ఈ ప్రోగ్రాం మంచి ఆల్టర్నేటివ్. కానీ దీనివల్ల అదో పెద్ద ఇష్యూ అవుతుందన్నమాటా వాస్తవమే. ఆ సంగతలా ఉంచితే... ఇలా ఎఫ్‌ఎమ్ ద్వారా విషయాన్ని తెలుసుకున్న ఆ అమ్మాయి హోమ్లీ గాళ్ అయితే, మళ్లీ ఆ అబ్బాయివంక కన్నెత్తయినా చూస్తుందా? అన్నది ఆలోచించాల్సిన విషయమే..." అంటాడు జెఎన్‌టియు ఇంజనీరింగ్ విద్యార్థి.

"ప్రేమను బహిర్గతం చేయడంలో మూడో వ్యక్తిని ఇన్‌వాల్వ్ చేయడమే నచ్చలేదనుకుంటుంటే... ప్రస్తుతం మా స్నేహితుల్లో చాలామంది తమ ప్రేమవిషయాన్ని రేడియో ఆర్జే ద్వారా చెప్పిస్తే ఎలా ఉంటుంది... అని ఆలోచిస్తున్నారు. ఆ కార్యక్రమం వినేవాళ్లలో కుటుంబసభ్యులూ ఉండటానికి అవకాశముందన్న విషయాన్ని వారు పట్టించుకోవటం లేదు. ఏదేమైనా ఈ పద్ధతివల్ల ఇరుకుటుంబాల పరువుప్రతిష్టలు దెబ్బతినే అవకాశమూ ఉంది" అని అపర్ణ అంటుండగానే... "ప్రేమిస్తున్నాడన్న విషయం అతను చెబితే ఏంటి? ఇంకొకరు చెబితే ఏంటి? ఎలాగైనా విషయం తెలియటమే ముఖ్యం... ప్రపంచంతోపాటు మనమూ మారాలి. వెల్ ఇన్ ఫ్రాగ్‌లా ఉంటే ఎలా...?" అంటూ మధ్యలోనే అందుకుంది ఓ అల్ట్రా మోడ్రన్ అమ్మాయి.

"ఇప్పటికే సినిమాల పుణ్యమాని చాలామంది పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడ్డారు. ఎఫ్‌ఎమ్‌ద్వారానూ ఈ ప్రభంజనం సాగుతోందనడంలో సందేహంలేదు. ఇద్దరికీ నచ్చితే పర్లేదు. మరి సదరు ఫోన్ చేసే వ్యక్తిని అవతలివారు ఇష్టపడకపోవచ్చు. ఇలాంటప్పుడే సమస్యలు చోటుచేసుకుంటాయి. తనను ఫలానా వ్యక్తి ఇష్టపడుతున్నాడని ఆమెకు తెలియడంతోపాటు, ఆ విషయం ఆ ప్రోగ్రాం వింటున్న లక్షలాదిమందికి ఎంటర్‌టైన్‌మెంట్ అవడం చాలా బాధాకరమైన విషయం. సదరు వ్యక్తికి గౌరవం, విలువల గురించి ఏ కొంచెం తెలిసినా ఇలాంటి విషయాలు బహిరంగంగా ప్రపోజ్ చేయరు" ఇది సైకాలజీ విద్యార్థి మనోజ్ మనోగతం.

"ఒకవేళ ఆ అమ్మాయికి అప్పటికే ఎంగేజ్‌మెంట్ అయిఉండొచ్చు... వేరొకర్ని ప్రేమిస్తూ ఉండొచ్చు... ఆ ప్రోగ్రాం వారు వింటే ఏం జరుగుతుంది? ఆ తర్వాత పరిణామాలెలా ఉంటాయి? ఇది ఖచ్చితంగా ఆలోచించాల్సిన విషయమే. మీడియావారు కమర్షియల్‌గా కాకుండా కొంచెం సమాజానికి మేలుచేసే విధంగానూ, విలువల్ని కాపాడేవిధంగానూ ఆలోచిస్తే బాగుంటుంది" అంటున్న ఒక ఎల్‌ఎల్‌బి విద్యార్థిని అభిప్రాయంతో ఏకీభవించారు బీకాం విద్యార్థినులైన అరుణ, రమ, శ్యామలలు.

"మనసులోని మాట బయటపెట్టడానికి ఇబ్బంది పడేవారికి ఇది ఓ హెల్ప్‌లైన్ లాంటిదే. కానీ ఈ పద్ధతి అమ్మాయి ప్రైవసీని దెబ్బతీసేవిధంగానూ ఉంది. అమ్మాయి ఫోన్‌నెంబర్ ఎఫ్‌ఎమ్ వారికిస్తాం... వారు ఆమెకు ఫోన్‌చేసి మనపై ఇష్టం ఉందో, లేదో తెలుసుకుంటారు. అంతవరకూ బాగానే ఉంటుంది. మనం ఇచ్చిన ఇన్ఫర్మేషన్‌ను వారు ఇంకోలా ఉపయోగించరని ఏంటి నమ్మకం?" అంటాడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శరత్. మరి మీరేమంటారు?

సినిమా కబుర్లు

చందు

సాధారణంగా సినిమా టైటిల్స్ నటుల ఇంటి పేర్లుగా ('షావుకారు' జానకి, 'సాక్షి' రంగారావు, 'శుభలేఖ' సుధాకర్) మారతాయి. కానీ శకుంతల విషయంలో అలా జరగలేదు. 'తెలంగాణా' మాండలికాన్ని ఇంటి పేరుగా చేసుకుని శకుంతల 'తెలంగాణా' శకుంతల అయింది. తెలంగాణా పాత్ర ఒకటి సినిమాలో ఉందంటే రచయిత, దర్శక, నిర్మాతలకు ముందుగా గుర్తుకొచ్చే నటి శకుంతల. తెలంగాణా మాండలికంలో మాట్లాడి నటిగా ఆమె లబ్ధి పొందడమేగాక తెలంగాణా మాండలికానికి ఓ ప్రత్యేక గుర్తింపును ఆమె తీసుకొచ్చిందంటే అందులో అతిశయోక్తి లేదు. కానీ ఆమె తన నిజ జీవితంలో ఆంధ్రా అమ్మాయిలా మాట్లాడుతుందంటే నమ్మశక్యంగా లేదు కదూ... మహారాష్ట్రకు చెందిన **తెలంగాణా శకుంతల** చెప్పిన మరిన్ని ముచ్చట్లు.

అమ్మ మగ పిల్లాడిలా పెంచింది

మాది మహారాష్ట్రలోని పూణె. నాన్నగారు మిలటరీ ఉద్యోగి. ఆయన ఉద్యోగరీత్యా నా పన్నెండేళ్ళ ప్రాయంలో హైదరాబాద్ వచ్చేశాం. పదో తరగతి వరకూ చదివినా పరీక్షలు రాయలేదు. మా ఇంటెదురుగా జయ రామారావుగారు ఉండేవారు. చీఫ్ ఇంజనీరింగ్ ఆఫీసులో పని చేసేవారు. ఆయన కొత్త వాళ్ళతో నాటకం వేయాలనుకున్నారు. నన్ను చూసి నాటకంలో ఈ అమ్మాయి అయితే బాగుంటుందనుకుని అమ్మను అడిగారు. అమ్మ నవ్వి 'అమ్మాయికి తెలుగు సరిగా రాదు. మొండి పిల్ల. ఎందుకండీ దానికి ఈ వేషాలు' అంది. మేం నలుగురం ఆడపిల్లలం. అమ్మ నన్ను మగ పిల్లవాడిలా పెంచింది. 'నేను చెప్పి చేయించుకుంటానమ్మా' అనేసి నన్ను తీసికెళ్ళారు. నా చదువంతా మరాఠీ భాషలో సాగడంతో తెలుగు చదవడం రాదు. వాళ్ళు చెప్పడం... నేను వినడం... విన్నది మళ్ళీ చెప్పడం... ఇలా మూడు నెలలపాటు రిహార్సల్స్ చేసిన తర్వాత కూడా చెప్పడం కష్టమనిపించి నేనింక చేయనని మొండికేస్తే జయరామారావుగారు చాక్లెట్ కొనిచ్చో, బిస్కెట్ కొనిచ్చో, బెత్తం చూపించో... మొత్తానికి... 1972 ఫిబ్రవరి 22న రవీంద్రభారతిలో నన్ను రంగస్థలంపైకి ఎక్కించారు. గరికపాటిగారు రాసిన 'దిక్కులేని పక్షులు' నాటకంతో నా రంగస్థల జీవితం ప్రారంభమైంది. జనాలు చప్పట్లు కొట్టడం నాకు మంచిగా అనిపించింది. ఆనందాన్నిచ్చింది. దీంతో నాటకాలంటే ఇష్టం ఏర్పడింది. నాన్నగారు చనిపోయిన తర్వాత నాటకాలే జీవనోపాధి అయింది.

స్ట్రెచర్‌లో నుంచే డబ్బింగ్ చెప్పా... కానీ డబ్బులెగ్గొట్టారు

1992లో నేనొక పెద్ద యాక్సిడెంట్‌కి గురయ్యాను. కాళ్ళూచేతులూ విరిగిపోయి సంవత్సరంపాటు బెడ్‌మీద ఉన్నాను. రంగస్థలంకోసం ఇంత చేశానే! మరిప్పుడు నాకు రెండు కాళ్ళూ విరిగిపోయి బెడ్ మీదుంటే ఎవ్వరూ సహాయం చేయలేదే! అనిపించి, రంగస్థలాన్నే నమ్ముకోకుండా నన్ను బతికించుకోవాలనిపించింది. కేవలం రంగస్థలమే అన్నం పెడుతుందనుకోవడం పొరపాటని నాకప్పుడు కనువిప్పు కలిగింది. బెడ్‌మీద ఉన్నంతకాలం ఇవే ఆలోచనలు. ఆరోగ్యం కుదుటపడిన తరువాత నారాయణమూర్తిగారు 'ఎర్రసైన్యం'లో ఆఫర్ ఇచ్చారు. అందులో పోషించిన సీతక్క పాత్ర మంచి గుర్తింపు తీసుకొచ్చింది. 'ఏమున్నదక్కో ఏమున్నదక్కా...' సాంగ్ ఇప్పటికీ హిట్టే. సినిమా నాకు మంచి పేరు తీసుకొచ్చినా రెండు సంవత్సరాలపాటు నటించలేకపోయాను. 'ఎర్రసైన్యం'లో పాత్ర రీత్యా ఎక్కువ పరిగెత్తాల్సి వచ్చింది. దీంతో యాక్సిడెంట్ అయినప్పుడు శరీరంలో అమర్చిన రాడ్స్, బాల్స్, వైర్స్ వలన నొప్పనిపించేది. ఇక నటించలేనేమో! అనుకుంటున్న టైమ్‌లో దాసరి నారాయణరావుగారు పిలిపించి "ఒరేయ్ రిక్షా" తీస్తున్నాం. అనురాధగారి పాత్రకు తెలంగాణా మాండలికంలో డబ్బింగ్ చెప్పాల'న్నారు. డబ్బింగ్ సూపర్‌గా సక్సెస్ అయింది. నా వాయిస్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు వచ్చింది. వెంటనే ఓ మంచి ఆఫర్ వచ్చింది– 'శ్రీవారంటే మావారే' సినిమాలో. చిత్ర కథానాయిక విజయశాంతికి తెలంగాణా మాండలికం నేర్పాలని అడిగారు. మూడు నెలలపాటు షూటింగ్‌లో విజయశాంతితోపాటే ఉండి తెలంగాణా నేర్పాను. ఇంతలో 'ఒసేయ్ రాములమ్మ'లో విజయశాంతికి అక్క పాత్ర ఆఫర్ వచ్చింది. 'ఒసేయ్ రాములమ్మ' సక్సెస్ అవడంతో ఒకదాని వెంట ఒకటి ఆఫర్లు వస్తున్నాయి. అలా చేసుకుంటూ పోతున్నాను. 2000 సంవత్సరంలో 'వైజయంతి' సినిమాలో వడివక్కరసి ('అందాలరాముడు'లో సునీల్ తల్లి) గారికి డబ్బింగ్ చెప్పే అవకాశం వచ్చింది. 'డబ్బింగ్ తెలంగాణా శకుంతల చెప్పినట్లు ఉండకూడదు, వడివక్కరసి తెలంగాణా మాట్లాడినట్లు ఉండాలి' అని 'వైజయంతి' దర్శకుడు అన్నారు. తెలంగాణా మాండలికంలో డబ్బింగ్ చెబితే శకుంతలలాగానే ఉంటుంది తప్ప వడివక్కరసి తెలంగాణా యాసలో చెప్పినట్లుండదు కదా! ఇంతకంటే బయటికొచ్చి చెప్పడం నాకు చేతకాదు, మీకిష్టమైతే చెప్పించుకోండి, లేకపోతే లేదని కరాఖండిగా చెప్పేశాను. సరే చెప్పమనడంతో రెండు రీళ్ళు చెప్పి రాత్రిపూట ఇంటికెళ్తుండగా యాక్సిడెంట్ అయింది. ప్రసాద్ ల్యాబ్స్ దగ్గర బ్రేక్స్ ఫెయిలై కారు ప్లాట్‌ఫాంని గుద్దుకుంది. మోకాలు విరిగిపోయింది. సర్జరీ చేశారు. సినిమా రిలీజ్ చేయాలనుకుంటే... నేను చెప్పిన రెండు రీళ్ల డబ్బింగ్‌తోపాటు మొత్తాన్ని వేరేవాళ్ళతో చెప్పించి విడుదల చేసుకోవచ్చు. 'వైజయంతి'లో విజయశాంతికి సరితగారు డబ్బింగ్ చెప్పేవారు. సరితగారు నేను చెప్పిన రెండు రీళ్ళ డబ్బింగ్ విని 'ఆమె కాకుండా ఎవరూ చెప్పలేరు. ఆసుపత్రి ఖర్చంతా భరించి ఆమెతోనే డబ్బింగ్ చెప్పించుకోండి' అని సలహా ఇచ్చారట. దాంతో మీరే డబ్బింగ్ చెప్పాలంటూ వారొచ్చారు. నేనేమో బెడ్‌మీదున్నాను. సర్జరీచేసి 52 కుట్లు వేశారు. నావల్ల సినిమా మధ్యలో ఆగిపోకూడదన్న ఉద్దేశంతో స్ట్రెచర్ మీద ప్రసాద్ ల్యాబ్స్‌కి వెళ్ళాను. రెండు సోఫాలు జంటగా వేసి పడుకోబెట్టారు. నామీద మైక్ పెట్టారు. వడవక్కరసిగారు భావోద్రేకాలు గల భారీ పాత్ర పోషించారు. అంతే ఎమోషన్‌లో డబ్బింగ్ చెప్పేసరికి కుట్లు ఓపెన్ అయిపోయాయి. వెంటనే డాక్టర్‌గారి దగ్గరికి వెళ్తే ఆయన తిట్టారు. బుద్ధుందా అని కోప్పడ్డారు. 'వైజయంతి' సినిమా వారిని రెమ్యునరేషన్ ఇమ్మని అడిగాను. 'డబ్బింగ్ పూర్తవగానే ఇస్తావమ్మా... అదమ్మా...ఇదమ్మా...' అన్నారు. ఆ పరిస్థితిలో డబ్బింగ్ చెప్పానంటే ఇవ్వాల్సినదానికంటే ఒక రెండు రూపాయలు ఎక్కువ ఇస్తారనుకుంటాం. మోసం చేస్తారని అనుకోం కదా! డబ్బింగ్ పూర్తయింది. సినిమా రిలీజై రెండు నెలలు దాటినా ఇంకా డబ్బులు పంపలేదు. డైరెక్టర్‌గారికి ఫోన్ చేసి అడిగితే... 'అదేంటమ్మా ఇచ్చేశామని చెప్పారే. అయితే ఇంకా ఇవ్వలేదా!' అనడిగారు. మొత్తంమ్మీద ఓ పదివేలిచ్చారు. ఆ క్యారెక్టర్‌కి మామూలుగా చెబితే పాతికవేలిస్తారు. మరి ఆ స్టేజ్‌లో వెళ్ళి చెబితే ఎంతివ్వాలి? పోన్లే భగవంతుడు ఉంటాడు అనుకుని వదిలేశాను. ఇది బెల్లంకొండ సురేష్‌గారి సినిమా.

(ఇంకా వుంది)

గూడు వీడేదెలా!

హాయ్! కింద రెండు పక్షిపిల్లలున్నాయికదూ. అవి ఎంత ముద్దుగా కనిపిస్తున్నాయో. గుడ్ల నుంచి అప్పుడే బయటకొచ్చిన పక్షి పిల్లలకు తల్లిని చూడాలనిపించింది. కాకపోతే గూటి లోంచి బయటకు రావడమెలాగో తెలీడంలేదు. కాస్త మీరు సాయం చేయొచ్చుకదా.



బాలనేస్తాలు

జలకాలాటలలో...



గిఫ్ట్ ట్యాగ్

క్రాంతి

హాయ్ ఫ్రెండ్స్! క్రిస్మస్ క్రాఫ్ట్స్ ఎలా ఉన్నాయి? బావున్నాయా? అయితే ఈ వారం గిఫ్ట్ ట్యాగ్ ఎలా తయారుచేయాలో నేర్చుకుందాం.

గిఫ్ట్ ట్యాగ్ తయారీకి ఏమేం కావాలంటే... మందపాటి కాగితం, స్కెచ్ పెన్, పాత కార్డులు (శుభలేఖలు లేదా గ్రీటింగ్ కార్డులు ఏవైనా సరే), కత్తెర, లేస్ లేదా మెరిసే దారం.

ఎలా చేయాలంటే... ముందుగా మందపాటి కాగితాన్ని తీసుకోండి. దాన్ని మీకిష్టమొచ్చిన ఆకారంలో కత్తిరించండి (బొమ్మ-1). ఇప్పుడు పాత గ్రీటింగ్ కార్డులన్నీ వెతికి, మీకిష్టమొచ్చిన డిజైన్‌ను ఎంచుకోండి. దాని మీద ఇందాక మీరు కత్తిరించిన కాగితం ముక్కను పెట్టండి. అదే ఆకారంలో కత్తిరించండి. 'ఒకవేళ పాత గ్రీటింగ్ కార్డులు దొరక్కపోతే అప్పుడు ఎలా?' అనుకుంటున్నారు కదూ. దానికి ఒక ఉపాయం ఉంది. అదేంటంటే... మెరిసే కాగితాన్ని అయినా అంటించివచ్చు. లేదా మీరు తినేసిన చాక్లెట్ రేపర్స్ వుంటాయి కదా. వాటిని కాగితం ముక్క మీద పెట్టి అంటించవచ్చు.

ఇప్పుడు ఈ రెండు కాగితం ముక్కలకు పై వైపున రంధ్రాలు చేయండి. వాటిలో నుండి లేసును దూర్చి ముడివేయండి. అంతే గిఫ్ట్ ట్యాగ్ రెడీ. ఇప్పుడు డిజైన్ లేకుండా వున్న కాగితం ముక్క వెనుకవైపు 'మెర్రీ క్రిస్మస్' అని స్కెచ్‌పెన్నుతో రాయండి. ముందువైపు ఎవరికైతే ఇస్తున్నారో వాళ్ల పేరు రాయండి. మీ ఇంటికొచ్చిన అతిథులకు బహూకరించండి. సరేనా.

వచ్చే వారం మరో క్రిస్మస్ క్రాఫ్ట్‌తో మళ్లీ కలుద్దాం. సెలవా మరి.



1

2

బి.స్వామి,
7వ తరగతి, ఊరి పేరు రాయలేదు.



పి.చంద్రకాంత్, 8వ తరగతి,
జిల్లా పరిషత్ స్కూల్, చేర్యాల, వరంగల్ జిల్లా.

జి.విజయ్‌మోహన్,
10వ తరగతి,
జిల్లా పరిషత్ స్కూల్,
పెనుబల్లి,
ఖమ్మం జిల్లా.

ఆ పది తేడాలు ఏంటో...

ఏమేం వున్నాయి?

హాయ్! పైన ఒక కుండీ వుందికదా. దానిమీద ఆర్టిస్టు అంకుల్ కొన్ని పక్షులు, జంతువుల బొమ్మలు వేశారు, అవి ఎన్నో, ఏంటో కనిపెట్టండి చూద్దాం.

జవాబు

మొత్తం నాలుగు వున్నాయి. జింక, చిలుక, నెమలి, కొంగ.

అట్టమీది కథ

నగేష్ బీరెడ్డి

ఇ-తరం ప్రేమ

ప్రేమే కదా జీవితం అంటారు కొందరు. ప్రేమే కాదు జీవితం అంటారు మరికొందరు. నాకంటూ ఓ మనిషి, నాదంటూ ఓ మనసు... నువ్వూ నేను, నువ్వేనేను ఇలా ఒక్కొక్కరు ఒక్కోమాట చెబుతుంటారు ప్రేమగురించి. ఎవరేం చెప్పినా ఏ ఇద్దరు ఒకేలా నిర్వచించలేని పదం ప్రేమంటారు. ఆ మధురభావన కనపించదు, వినిపించదు. కానీ కవ్విస్తుంది, నవ్విస్తుంది, లవ్విస్తుంది. కుర్రాళ్లను మురిపించగలదు, మైమరపించగలదు. ముసలివాళ్లను కూడా పసిపిల్లల్లా ఏడిపించగలదు. ప్రేమ.. ఈ రెండక్షరాలు... హత్యలు చేయిస్తున్నాయి. ఆత్మహత్యకూ దారి తీస్తున్నాయి. గతంలో ప్రేమికులను హింసించేవారు. ఇప్పుడు ప్రేమించమంటూ హింసిస్తున్నారు. ప్రేమించకుంటే నరికేస్తున్నారు. ప్రేమించడం లేదంటూ ట్యాంకులెక్కి దూకేస్తున్నారు. అలా అని వీటిని వేటినీ ప్రమాణంగా తీసుకుని ప్రేమ పవిత్రతను తప్పుగా అర్థం చేసుకోలేం. ప్రేమ కోసం గెలిచిన వారున్నారు. ప్రేమను గెలిపించిన వారూ ఉన్నారు. ప్రేమే జీవితం కాదు. ప్రేమ జీవితంలో ఒక భాగం మాత్రమే. ఇది ఈ తరం యువతలో ఎక్కువగా వ్యక్తమవుతున్న అభిప్రాయం. వారి హృదయాంతరాల్లో దాగున్న అధునిక ప్రేమ అంతరంగాలు... నేటి తరం యువత మనసు పలికే మౌనరాగాలు...

ప్రేమంటే... ఇదేరా?

ప్రేమ నిర్వచనం కోసం మనిషి చాలాకాలంగా అన్వేషిస్తున్నాడు. కానీ సరైన అర్థాన్ని పొందలేకపోయాడు. ప్రేమను అంత సులభంగా నిర్వచించలేం. ప్రేమంటే ఏంటీ? ఈ ప్రశ్నను ఎవరినైనా అడిగి చూడండి. టక్కున సమాధానం చెప్పేవాళ్లు చాలా తక్కువమంది ఉంటారు. ప్రేమనేది కొన్ని మనోభావాల మాలిక. ఇది ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. ఒక్కొక్కరి అనుభవాలు ఒక్కొక్కలా ఉంటాయి. నేను అనే భావన కంటే తాను అనే భావన ఎక్కువగా ఉండడాన్నే ప్రేమ అంటారు. అది మాత్రమే ఉండి అంతం లేనిది ప్రేమ. ప్రేమే సర్వం. ప్రేమే సత్యం. ప్రేమే నిత్యం. ఇలా ఒక్కొక్కరూ ఒక్కో నిర్వచనం చెబుతుంటారు. కానీ శాస్త్రీయంగా చెప్పాలంటే మెదడులోని రసాయనిక చర్యల ద్వారా ప్రేమ పుడుతుందని నిపుణులు చెబుతుంటారు. ఇదే ఫీలింగ్ చాక్లెట్ తిన్నప్పుడు కూడా కలుగుతుందట. అప్పుడూ మెదడు ప్రేమానుభూతులనే కలిగిస్తుందట.

రకరకాల ప్రేమలు

రెండు హృదయాల మధ్య వారధి ప్రేమ.



రెండు హృదయాల రథ సారధి ప్రేమ. ఏకమైన రెండు హృదయాల వెనుక రకరకాల కారణాలు... కొందరు చిత్ర విచిత్రంగా కలుసుకుంటుంటారు. కొందరి మధ్య చాలా రోజుల వరకు ప్రేమ పుట్టదు. కొందరు తొలి చూపులోనే ప్రేమించుకుంటారు. ఇద్దరి మధ్య పరిచయం స్నేహంగా మారుతుంది. ఆ తర్వాత అది ప్రేమగా మారుతోంది. ఒకరికి ఇష్టం ఉండి మరొకరికి ఇష్టం లేక వద్దనుకుని జీవితాంతం స్నేహితులుగానే మిగిలిపోయిన వారున్నారు. 'ఛీ మీ మగాళ్ళంతా ఇంతే. కాస్త చనువుగా మాట్లాడితే ప్రేమనుకోవడమే' అంటూ చీదరించుకుని విడిపోయినవారూ ఉన్నారు. ఇతర ఫీలింగ్స్ ద్వారా ప్రేమ మనిషిని కన్‌ఫ్యూజ్ చేస్తుంది. స్వచ్ఛమైన ప్రేమకు అర్థాన్ని మారుస్తుంది. టీనేజ్‌లో ఎదుటి వ్యక్తిపై కలిగిన ఇంట్రస్ట్ ప్రేమో ఆకర్షణో తెలీక సతమతమవుతున్న వారున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నవాళ్లూ ఉన్నారు. కొందరు ఎదుటి వ్యక్తికోసం ఏదో చెయ్యాలనుకుంటారు. ఇదీ ప్రేమే. అంత మాత్రాన తప్పుగా అర్థం చేసుకోవద్దు. అది సోదర ప్రేమ కావొచ్చు.

కొందరు ఎదుటి వ్యక్తి నుండి ఏదో ఆశించి ప్రేమిస్తుంటారు. ఇది అసలు ప్రేమే కాదు. నటన. స్వార్థప్రేమ. కొందరు ప్రేమిస్తున్నామంటూ వెంటపడుతుంటారు. కాదంటే వేధిస్తుంటారు. లేకుంటే హింసిస్తుంటారు. ఇది శాడిస్టు ప్రేమ. తానే లోకంగా, తానే జీవితంగా, తానే దైవంగా, తాను ఔనన్నా కాదన్నా, తానే తానుగా కొందరు బతుకుతుంటారు. ఇది స్వచ్ఛమైన ప్రేమ.

నేటి తరం ప్రేమ

'ఈ నెల మా ఫోన్ బిల్లు ప్రతిసారి కంటే మూడు రెట్లు ఎక్కువొచ్చిందండీ'

'అయితే, మీ అమ్మాయి ప్రేమలో పడుంటుంది... చూడండి'

❖ ❖ ❖

'వీడికి ఏం పోయే కాలం వచ్చిందో. పొద్దున్నే మొదలెట్టిండు. ఫోన్‌లో బాతాకానీ. అర్థరాత్రయినా ఆపడు'

❖ ❖ ❖

'అబ్బ! ఏంటో ఈ కాలం పిల్లలు. ఆడా లేదు మగా లేదు. చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు. పెద్దోళ్లు చూస్తున్నారన్న ఇంగిత జ్ఞానం కూడా లేదు భడవలకి'

ఇలాంటి సంభాషణలు నిత్య జీవితంలో మీరు ఎపుడో అపుడు వినే ఉంటారు. ఫోన్ బిల్ ఎక్కువగా రాగానే తల్లిదండ్రులు పిల్లల్ని అనుమానించడం. సెల్‌ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతుంటే రూమ్‌మేట్ చీదరించుకోవడం. రోడ్డుపై కలిసి వెళ్తున్న ప్రేమ జంటను చూసి బామ్మగారు ముక్కున వేలేసుకోవడం మనం చూస్తూనే ఉంటాం. పాతకాలం వారు భర్త పేరు చెప్పేందుకే సిగ్గుపడేవారు. ఆయన్ని పేరు పెట్టి పిలవడం అమర్యాదగా భావించేవారు. కానీ నేటి ఫాస్ట్ కల్చర్‌లో ప్రేమికుని రారా, పోరా అని పిలుస్తున్నారు. పెరుగుతున్న సాంకేతిక అభివృద్ధి మానవ జీవితంపై విపరీత ప్రభావం చూపుతోంది. ఇది ఆరోగ్యకరమైనదే అయితే పర్వాలేదు. కానీ అదుపు తప్పితే ముప్పుకు తీవ్ర పరిణామాలు ఎదురవుతున్నాయి. సెల్(సొ)ల్లు ఫోనుల్లో కబుర్లతో ప్రేమికులు కాలయాపన చేస్తున్నారు. ఎస్ఎమ్ఎస్‌లతో బిజీగా ఉంటున్నారు. ఆ మధురానుభూతుల కోసం విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారు. కొన్ని పొందాలంటే కొన్ని వదులుకోక తప్పదుగా అని కౌంటర్లూ వేస్తున్నారు. ఇంటర్‌నెట్‌తో ఇక వారికి టైమే తెలీదు. ఆ అబద్ధపు జీవితపు ఆనవాళ్లతో పెడదోవ పడుతున్నారు. ఛాటింగ్‌లు, డేటింగులకోసం గంటల తరబడి సిస్టమ్ ముందు నుండి లేవడం లేదు. మూగబాసలతో, కళ్లతో ప్రేమించుకునే వారమని చెబుతుంటారు పాతకాలంవారు. నేటి యువత ఛాటింగ్‌లో పరిచయమైన అమ్మాయిని అయిదు నిమిషాల్లోనే డేటింగ్ అడుగుతున్నారు. అక్కడివరకు వెళ్లింది మన సంస్కృతి. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ ఉదంతాన్నే తీసుకోండి. తెలిసీ తెలియని వయసులో ప్రేయసితో శృంగారం... దాన్ని సెల్ కెమెరాతో రికార్డు చేసి ఇంటర్ నెట్‌లో పెట్టడం ఎంతటి పరిణామాలకు దారితీసిందో.

ప్రేమించుకుందాం...రా!

ఉదయం పరిచయమై, మధ్యాహ్నం మాట కలిపి, సాయంత్రం సరదాగా సిన్మాకెళ్లి, రాత్రికి రాజీపడి ఆ వెంటనే విడిపోతున్న రోజులివి. ఈ తరుణంలో పీటల వరకు వచ్చే ప్రేమలను వేళ్లపైనే లెక్కించొచ్చు.

కుక్కపిల్ల, సబ్బుబిళ్ళ, అగ్గిపుల్ల కావేవీ కవితకు అనర్హం అన్నాడో మహాకవి. కాలేజీలు, ఆఫీసులు, క్లబ్బులు, పబ్బులు, బస్టాపులు, రిసార్టులు కావేవీ కలుసుకోవడానికి అనర్హం అంటున్నారు ప్రేమికులు. రొటీన్‌గా కలుసుకోవడం అంటే బోర్ ఫీలవుతున్నారు. కొత్త కొత్తగా ప్లాన్ చేసుకుంటున్నారు. వారికి పార్కులిప్పుడు పాతబడి పోయాయి. పబ్బులు, పిజ్జా పార్లర్లు, నైట్‌టైమ్ పార్టీలు... ఇవి నవతరం ప్రేమికుల స్పాట్లు. ఇంకా చెప్పాలంటే గంటల కొద్దీ ఇంటర్‌నెట్ కేఫుల్లో గడుపుతున్నారు. అక్కడ వారెక్కే వేడి గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది.

యూనివర్సల్ కోడ్స్

143.. ఐ లవ్ యు... ఇది ఎంత పాపులర్ అయిన యూనివర్సల్ కోడో మీకు తెలుసు. మనసుంటే మార్గం ఉంటుందంటారు పెద్దవాళ్లు. మనసు తెలిపేందుకూ మార్గం వెతుకుతున్నారు నవతరం వాళ్లు. తమ ఇష్టసఖిని కలుసుకునేందుకు ఇప్పుడు అష్టకష్టాలు పడాల్సిన పనిలేదు. ఒక్కొక్కరిది ఒక్కో దారి. 'ఒక్కసారే ఫోన్ రింగయితే ఎత్తకు. రెండుసార్లు రింగిస్తాను. మూడోసారి లాంగ్ రింగ్ వస్తుంది. అది నేనన్నమాట. అప్పుడు.. ఫోన్ లిఫ్టు చెయ్యి. ఇలాంటి ఫోన్ కోడ్స్ వారి మధ్య చాలానే ఉన్నాయి. ఇక 24 గంటలూ మాట్లాడుకోవడానికి వారికి సెల్‌ఫోన్లు ఉండనే ఉన్నాయి.

కొ(చె)త్తపుంతలు

పిడికెడంత గుండెలోని కొండంత ప్రేమను వ్యక్తీకరించడానికి యువత కొత్తకొత్త దారులు వెతుకుతోంది. తమ హృదయాలను వెరైటీగా ఆవిష్కరించేందుకు వినూత్న పుంతలు తొక్కుతోంది. మూగబాసలతో కళ్లతో ప్రేమించుకునేవారు పాతకాలం వారు. ఆ కాలం మారింది. ఐటీ అభివృద్ధి చెందింది. ఆన్‌లైన్ ప్రేమలు అవతరించాయి. అవతలి వ్యక్తి ఎక్కడుండేదీ, ఎలా ఉండేదీ తెలియదు. కానీ రోజూ ఛాటింగ్ చేస్తారు. ఇలా మొదలై పెళ్లివరకు వెళ్లిన ప్రేమలు చాలానే ఉన్నాయి. గతంలోలాగా ప్రేమికులిప్పుడు ఓ ఉత్తరం ముక్క రాసి దానికోసం ఎదురు చూడాల్సిన పనిలేదు. సింపుల్‌గా ఎస్ఎమ్ఎస్ చేస్తే చాలు. ఇక వారి సెల్‌ఫోన్ కబుర్ల గురించంటారా... మాటల్లో చెప్పనలవి కాదు.

పప్పీ లవ్

కొందరు ఫిలాసఫర్లు నిర్వహించిన సర్వేలో నాలుగు నుండి ఆరు సంవత్సరాల పిల్లలు కూడా ప్రేమను పంచుకోవడాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఆ చిన్నారి అమాయకత్వపు హృదయాలకు ఆ రెండక్షరాల ప్రేమ పట్ల ఉన్న అభిప్రాయం వారిని సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. వారినుండి స్వచ్ఛమైన ప్రేమకు అర్థాన్ని వారు సంపాదించలేకపోయారు.

టీనేజర్స్‌లో పుట్టే ప్రేమ చాలావరకు ఆకర్షణ మాత్రమే. అది తాత్కాలికం. అప్పటి వరకే వారు ఆ వ్యక్తిని వదిలి ఉండలేకపోతుంటారు. కానీ కొంత అలవాటు చేసుకుంటే ఆ తర్వాత వారికి అదే అలవాటవుతుందట. ఎదుటివారిని వారు చాలా ఈజీగా మర్చిపోగలుగుతారు. దీన్నే పప్పీ లవ్ అంటారు.

మనసంతా మ..మ..మ్మాస్

ఇప్పటి కుర్రాళ్లా... బాబోయ్... దేన్నీ లక్ష్యపెట్టరు. అంతా నిర్లక్ష్యం. పెద్దల మాట అసలు వినరు... సినిమాలు, షికార్లు... వాళ్ళ లోకం వారిదే... ఇవీ నేటి నవతరం గురించి తరచూ వినిపించే వ్యాఖ్యలు. కానీ వారిని ఒక్కసారి కదిపితే వారి మనసంతా మ..మ..మ్మాస్. ప్రేమా గీమా జాన్తానై.. కేరీరే మా లక్ష్యం. ఆ తరువాతే మిగిలినవన్నీ అని నిక్కచ్చిగా చెబుతున్నారు. పాతకాలపు ఆంక్షలకు వారు దూరంగా ఉంటున్నారు. సొంత వ్యక్తిత్వంతో స్వేచ్ఛగా విహరించాలని ఆరాటపడుతున్నారు. నేటి తరం యువతీ యువకుల్లో ఎక్కువ శాతం యువతులే తమ భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రాధాన్యత నిస్తున్నారు. యువకులు మాత్రం ప్రేమ వైపు మొగ్గు చూపుతున్నారు.

'దూకుడు' ప్రేమ

యువతరంలో ప్రేమ పిచ్చి ముదిరి పాకాన పడుతోంది. సిన్మాలు, ప్రసార సాధనాల ప్రభావంతో భగ్న ప్రేమికులు తమ అఘాయిత్యాలను బహిరంగ ప్రదర్శనలుగా మారుస్తున్నారు. వ్యక్తిగత సమస్యలను రచ్చకెక్కించి రసాభాసగా మారుస్తున్నారు. వాటర్ ట్యాంకులు, సెల్ టవర్లు వీరి ఆత్మాహుతి బెదిరింపులకు వేదికలుగా మారుతున్నాయి. ఇటువంటి సంఘటనలు ఒకవైపు ప్రజాజీవనానికి ఆటంకం కలిగిస్తున్నాయి. మరోవైపు పోలీసులకూ తలనొప్పిగా మారుతున్నాయి. ప్రసారసాధనాలు కూడా ఇటువంటి సంఘటనలకు ప్రాముఖ్యత కల్పిస్తుండడంతో, ఒకరిని చూసి మరొకరు ఇలాంటి దుస్సాహసాలకు ఒడిగడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు మన రాష్ట్రంలో సెప్టెంబర్‌లో ఒకటి, అక్టోబరులో ఒకటి జరిగాయి. ఒక్క నవంబర్‌లోనే మూడు సంఘటనలు కలకలం రేకెత్తించాయి.

ఏదేమైనా ప్రేమ అజరామరం. ఇది మనిషి పుట్టినప్పట్నుంచీ వుంది. మనిషి మనుగడ వున్నంతవరకూ వుంటుంది. సినిమాల్లో చూపిస్తున్నట్లు ప్రేమ అంటే యువతీయువకుల మధ్య పుట్టేది మాత్రమే అనే ఒక అపోహ వున్నప్పటికీ తల్లీబిడ్డల ప్రేమ, ఇతర బంధుమిత్రుల మధ్య ప్రేమ... ఇలా ఎన్నో రూపాల్లో, ఎంతో గాఢంగానూ వుంటుంది. ఇకపోతే మదర్ థెరిసాలాంటి ఉన్నతులది 'నా...నీ...' బేధం లేని నిస్వార్థమైన యూనివర్సల్ లవ్. ఆ స్థాయిలో కాకున్నా మనమూ జాతి, కుల, మత బేధంలేని అలాంటి ప్రేమకోసం ప్రయత్నిద్దామా...!

డాక్టర్॥ చంద్రభూషణ్,
ఆర్థోపెడిక్ సర్జన్, హైదరాబాద్.

కీళ్లు బిగుసుకుపోతే?



కీలు అంటే రెండు ఎముకలు కలిసే ప్రదేశం. ఈ రెండిటి చివరి భాగాలు నున్నగా ఉంటాయి. పైన కార్టిలేజ్ పొర ఉంటుంది. రెండిటిమధ్య చాలా సన్నని ఖాళీ వుంటుంది. తర్వాత రెండు ఎముకల్ని పట్టి వుంచడానికి లిగమెంట్లు ఉంటాయి. దీనిని జాయింట్ కాప్ స్యూల్ అంటారు. కొన్ని కీళ్లు ఒక పక్కకు వంగడానికి మాత్రమే తోడ్పడతాయి. ఇంకొన్ని రెండు పక్కలకూ తిరిగేట్టు చేయగలవు. మరికొన్ని అన్ని పక్కలకూ తిరిగేట్టు అవయవానికి తోడ్పడగలవు. అలాంటి కీలు భుజంలో వుంది. చేతిని భుజం దగ్గర అన్ని పక్కలకూ, చుట్టూ కదిలించగలం.

పెరి ఆర్థ్రయిటిస్ : ఒక్కోసారి ఈ కీలు కొంత మూసుకుపోయి కొంతమాత్రమే వుంటుంది. చేతిని పూర్తిగా పైకి వెనక్కి కదిలించలేని స్థితి వస్తుంది. బనీను, చొక్కాలాంటివి వేసుకోవాలన్నా తీయాలన్నా కూడా చాలా ఇబ్బంది అవుతుంది. ఇలా భుజం దగ్గర కీలు కొంత మూసుకుపోవడాన్ని, పెరి ఆర్థ్రయిటిస్‌ను తొలగించవచ్చు. బాగా కీలు బిగుసుకుపోతే శస్త్ర చికిత్సతో మళ్లీ పూర్తిగా కదిలేట్టు చేయవచ్చు. సాధారణంగా ఒకటి రెండు సంవత్సరాలలో ఈ ఇబ్బంది తొలగిపోవచ్చు. అలా తొలగని పక్షంలో శస్త్ర చికిత్స అవసరమవుతుంది. తుంటి దగ్గర కీలుకన్నా మోకాలు దగ్గర కీలు ఎక్కువగా అరిగిపోయే ప్రమాదముంది. అందుకే మోకాళ్ల బాధతో ఇబ్బంది పడుతున్నవాళ్లు మనకు ఎక్కువగా కనిపిస్తుంటారు.

ఆస్టియో ఆర్థ్రయిటిస్ : కీళ్ల దగ్గర ఎముకలు అరిగిపోవడాన్ని ఆర్థ్రయిటిస్ అంటారు. మొత్తం మనకు 101 రకాల ఆర్థ్రయిటిస్ రావచ్చు. కాని ఎక్కువమందిని బాధిస్తున్న ఆర్థ్రయిటిస్ ఆస్టియో ఆర్థ్రయిటిస్. సాధారణంగా నలభై సంవత్సరాల వయసు దాటాక ఆస్టియో ఆర్థ్రయిటిస్ వచ్చి మోకాళ్ల నొప్పులతో బాధపడుతుంటారు. మగవాళ్లలో అరవై సంవత్సరాల వరకూ ఈ వ్యాధి ఎక్కువ. ఆడవాళ్లలో అరవై తర్వాత ఎక్కువగా వస్తుంది.

కీళ్లని అతిగా వాడడంవల్ల : అంటే ఆ ప్రాంతాలలో అవయవాన్ని ఎక్కువగా కదిలించడం వల్ల కీళ్లలోని కార్టిలేజ్ పొర దెబ్బతింటుంది. ఇలా నష్టం జరగడం మధుమేహం, రుమటైడ్ ఆర్థ్రయిటిస్ వున్న వాళ్లలో ఎక్కువ. అలాగే ఇంతకుముందు మనం అనుకున్నట్లు వయసు ఎక్కువున్న వాళ్లల్లోనూ ఈ ఆర్థ్రయిటిస్ చాలా సాధారణంగా వస్తుంటుంది. మనలో స్ట్రెస్, స్ట్రెయిన్ - ఒత్తిడి, అలసట ఎక్కువగా కలగడం వల్ల కూడా కీళ్లు త్వరగా అరుగుతాయి.

చార్‌కాట్స్ జాయింట్ : కీలు దగ్గర వాపు వుంటుంది. కాకపోతే నొప్పి, స్పర్శ తక్కువగా వుండడంవల్ల జాయింట్ కదలిక ఎక్కువగా వుంటుంది. అందువల్ల జాయింట్ అరుగుతుంది.

కీళ్లు బిగుసుకుపోతే : ఒక్కోసారి కీళ్లు పట్టుకుపోతాయి. అంటే బిగుసుకుపోతాయి. ఈ స్థితిని ఫిజియో థెరపి, వ్యాయామాలతో తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా యోగా మంచిది. యోగావల్ల జాయింట్స్‌లో ఫ్లెక్సిబిలిటి పెరుగుతుంది. వయసు ఎక్కువున్నవాళ్లు జిమ్‌కి వెళ్లి పవర్ ఎక్సరసైజెస్ చేయలేరు. వాళ్లకి యోగా మంచిది. ఈ కీళ్ల నొప్పులు ముఖ్యంగా బరువు ఎక్కువున్న వాళ్లలో వస్తుంది. అందుకని బరువు తగ్గడం అవసరం. అందుకు ఈత ఎంతగానో తోడ్పడుతుంది. ఈత రాకపోతే వేగంగా నడుస్తూ వ్యాయామాన్నయినా చేయాలి. కీళ్లని అతిగా వాడడంవల్ల కూడా అరిగిపోతాయనుకున్నట్లు, ఇది సాధారణంగా ఆటగాళ్లలో కనిపిస్తుంది. అలాగే మనదగ్గర ఆడవాళ్లు కింద బాస్పెట్లు వేసుకుని కూర్చుని ఇంటి పనులు చేసుకుంటూ వుంటారు. అలా 360 డిగ్రీలలో కీళ్లని తరచూ వంచి పనిచేస్తుండడంవల్ల ఆర్థ్రయిటిస్ వస్తుంటుంది. కీలు అరిగినట్లు తెలుసుకునే లక్షణాలు కాస్త విశ్రాంతి తీసుకున్న తర్వాత లేస్తే కీళ్ల దగ్గర పట్టుకుంటున్నట్లు అనిపిస్తే దాన్ని ఆస్టియో ఆర్థ్రయిటిస్ ప్రథమ దశగా మనం గుర్తుంచుకోవాలి. ఉదయం నిద్రలేవగానే కీళ్ల దగ్గర నొప్పులుంటాయి. తర్వాత నడుస్తుంటే నొప్పి తగ్గి మామూలుగా అనిపిస్తుంది. ఇదీ ప్రథమ దశ లక్షణమే. క్రమంగా కీళ్లదగ్గర వాయడం ప్రారంభమవుతుంది. కీలు దగ్గర కదలిక వచ్చినప్పుడల్లా కరకరమనే శబ్దం వస్తుంటుంది. కాళ్లు వంకరవడం ప్రారంభిస్తాయి. బిర్రబిగుసుకుంటాయి. కాళ్లని తిన్నగా వుంచాలంటే ఇబ్బంది అవుతుంది. పూర్తిగా మడచడమూ రాదు.

బాగా నొప్పి కలుగుతుంటుంది. ఆస్టియో ఆర్థ్రయిటిస్ దశలు అంటే ఏ అనారోగ్యాన్నయినా ప్రథమ దశలో గుర్తిస్తే చికిత్స తేలిక. స్వస్థత త్వరలోనే కలుగుతుంది. కాబట్టి ప్రారంభ దశలో దీనిని గుర్తించడం అవసరం. ప్రారంభ దశలో నొప్పి, పట్టుకుపోవడం వుంటుంది. జాయింట్లో మార్పులేవీ వుండవు. ఉన్నా చాలా చిన్న మార్పులు ఉంటాయి. ఎక్స్‌రే తీస్తే మామూలుగానే వుంటుంది. వ్యాయామం లేక ఫిజియో థెరపి చేయించుకోవడం, క్రోసిన్ లాంటి మైల్డ్ పెయిన్ కిల్లర్స్‌ని తీసుకుంటూ వాచిన ప్రాంతంలో ఆయింట్‌మెంట్ రాయడం, కాపడం పెట్టడం మొదలైన చర్యలతో పరిస్థితిని అదుపులోకి తెచ్చుకోవచ్చు. గ్లూకోజెనిన్, కాండ్రియోటిన్ లాంటి మందులు వాడితే అరిగిన ప్రదేశాలు మామూలవుతాయి.

మొదటి దశలో నిర్లక్ష్యం చేస్తే ఆస్టియో ఆర్థ్రయిటిస్ రెండవ దశలోకి వస్తుంది. ఈ దశలో నొప్పి వుంటుంది. కాళ్లు కదిలిస్తే కీళ్ల దగ్గర కరకర శబ్దం వస్తుంది. బిగుసుకుపోతుంటాయి. కీలు దగ్గర కదలికలు తగ్గుతాయి. పూర్తిగా తిరగలేం. కొన్ని కొన్ని ఇబ్బందులు మొదలవుతాయి. ఎక్స్‌రేలో కొద్దిపాటి మార్పులు కనిపిస్తాయి. ఎముకల పైభాగం గరుకవుతుంది. సిస్ట్‌లు ఏర్పడతాయి. కార్టిలేజ్‌లో, బోన్‌లో కూడా మార్పులొస్తాయి. ఎముకల పైభాగం రఫ్ అవడం వల్ల కదిలిస్తుంటే కరకర శబ్దం వస్తుంది. బరువు తగ్గడానికి వ్యాయామం చేయాలి. నొప్పుందని కదలకుండా కూర్చుంటే కండరాలు బిగుసుకుపోతాయి. అందుకని కాళ్లని కదిలిస్తుండాలి. జెల్ లాంటి వాటిని మోకాళ్ల మీద రాయాలి. కాపడం పెట్టవచ్చు. గ్లూకోజనిన్ గాని, బాండేజ్‌ని గాని వాడాలి. మెట్లు ఎక్కడం మానాలి. ఫిజియో థెరపీ చేయించాలి.

ఇక మూడవ దశలో విశ్రాంతిగా పడుకున్నా మోకాళ్ల దగ్గర బాగా నొప్పి వుంటుంది. దాంతో ఎక్కడికీ కదలరు. కాళ్లని కదిలిస్తే కీళ్ల దగ్గర కరకర శబ్దాలెక్కువవుతాయి. కాళ్లు వంగిపోతాయి. రెండు ఎముకల మధ్య గాప్ తగ్గి ఒకదానికొకటి రాసుకుంటుండడంతో ఈ శబ్దం అధికమవుతుంది. ఎముక పైభాగాన ఒకపక్క నున్నగా, రెండో పక్క ఎక్కువగా అరగడంతో జాయింట్ అలైన్‌మెంట్ దెబ్బతింటుంది. ఈ స్థితిలో శస్త్ర చికిత్స అవసరం.

ఎముకని కత్తిరించి చేసే చికిత్స ఆస్టియోటమి. బయటపక్క బాగున్నప్పటికీ అంటే పెటల్ బాగుండి లోపలి భాగం దెబ్బతింటే ఆస్టియోటమీ చేస్తారు. అలాకాక బయటపక్క పెడల్ భాగం, లోపలి భాగం కూడా దెబ్బతింటే జాయింట్ రిప్లేస్‌మెంట్ తప్పదు. జాయింట్ రిప్లేస్‌మెంట్ వల్ల నొప్పి తగ్గుతుంది. నడవగలరు. ఈత కొట్టగలరు. కాళ్లు మామూలవుతాయి. కాకపోతే వంద శాతం సాధారణ స్థితికి రావు. 80 వరకు మాత్రమే వస్తాయి. ఈ మార్చిన కీలు పదిహేనేళ్ల దాకా వుంటుంది. మళ్లీ అప్పుడు చేయించుకోవడం అవసరం.

కథ

శ్రీకృష్ణ వరప్రసాద్



నీ లేఖ

నీ లేఖ
నీ లేఖ

నీకు బుద్ధి లేదు. అవును! బుద్ధి లేదు గనుకే నీ వెంటపడ్డాను అంటావేమో! వితండవాదానికి కాలుదువ్వటం నీకు అలవాటే కదా! అలా అనటంలోనూ ఓ నిజాన్ని అనుకోకుండానే ఒప్పుకున్నావని గుర్తించవు. అయినా నిన్ను అనుకోవడమెందుకు? ఎదుటివాళ్లను ఒక వేలితో చూపితే మూడు వేళ్లు మనవైపే తిరిగినట్టు...

అసలు నాకే బుద్ధి లేదేమో! లేకపోతే నిన్ను ప్రేమించడమేంటి? అదీ మొదటిసారి కల్సినప్పుడే 'ఐ లవ్ యూ' అని చెప్పినవాణ్ని! ఎవరైనా నచ్చినవాణ్ని ప్రేమిస్తారు గానీ... కానీ నిజం చెప్పాలంటే, అప్పుడు నువ్వలా చెప్పగానే నన్ను నేను మర్చిపోయాను. నా ఫేవరెట్ డైరెక్టర్ మణిరత్నం 'సఖి'లో హీరోలా ఎంత నేరుగా, డేర్‌గా చెప్పావు అనుకున్నాను. 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' కాబోలు అని మురిసిపోయాను. కానీ నువ్వు మాధవన్ అభిమానివని, అతనందులో అలా నటిస్తే, నువ్వు అతణ్ని అనుకరించడానికి అలా ప్రవర్తించావని నాకు కొన్నాళ్లలోనే తెల్సిపోయింది. ఓసారి నీతోకలిసి కాఫీ తాగుతున్నప్పుడు, నీ మాటల్లో బైటపడిందది. అప్పుడు దాని గురించి నిన్ను నిలదీయబోయినదాన్నే 'కుర్రకారుకిది కామనేలే!' అనుకున్నాను. నేనేదో పెద్ద ముదిఒగ్గునైనట్టు.

మురిపించడంలో నువ్వు మాస్టర్‌వి కాకపోయినా, నీ ప్రతిమాటకీ, అంతకుమించి చేష్టలకీ పరవశించిపోయేదాన్ని. కామెర్లరోగి... సామెతేమోగానీ, అప్పుడు నీ సమక్షంలో నాకు లోకమంతా ఆకుపచ్చగానే కన్పించేది. అందుకుతోడు, నాకుతోచినట్లు నేను మాట్లాడితే నువ్వు బుద్ధిగా పడుండేవాడివి కూడా. నిన్ను 'చెవలాయ్' అని పిలిస్తే మొదట కస్సుమన్నా, తర్వాత నుంచీ బహుచక్కని హావభావాలు ప్రదర్శించేవాడివి కదా!

నేను మొదటిసారి 'చెవలాయ్' అన్నప్పుడు "చవట అనాలన్పించి, అతి తెలివిగా ఇలా అంటున్నావా? ఏంటి?!" అని నోటిని వీలైనంత బిగ్గర చేసి అడిగావ్!

"ఊహూ... కాదు కాదు" అంటూ బెదిరిపోయి, "నేనేం చెప్పినా శ్రద్ధగా చెవులొగ్గి వింటావని అలా అన్నాను. ఊరికే కామెడీకి! నీకు కోపమొచ్చిందా? సారీ.." అంటూ లెంపలేసుకున్నాను.

"నువ్వు మాట్లాడితే నేనెందుకు అంత బాగా వింటానంటే, ఎస్.జానకి తర్వాత నాకు ఇష్టమన్పించేది నీ వాయిస్సే. నీ మాటలు నాకు పాటంత బాగుంటాయి గనక. ఈ కాంప్లిమెంట్‌ను పట్టుకుని సినిమాల్లో ప్లేబ్యాక్ సింగర్ అవ్వాలని ప్రయత్నించకు సిల్లీగా" అన్నావు.

ప్రతి ఏటా ప్రకృతిని పలకరించటమే గాక, కొన్నాళ్లు సాహచర్యం నెరపుతుంది చూడు వసంతం! అలా ఈ సంఘటన మన ప్రేమకు వసంతశోభను జోడించింది.

రోజులు గడుస్తున్న కొద్దీ చేరువవుతున్న మనం ఒకరినొకరం అర్థం చేసుకోవటంతో పాటు అప్పుడప్పుడూ కొన్ని అపార్థాలు. 'చిన్నచిన్నవి సహజమే కదా' అని ఒకరికొకరం సర్దిచెప్పుకునే వాళ్లం. మరి మన మధ్య ప్రేమ అంతటిది!

నా పుట్టినరోజునాడు "నీకోసం ఏం కొని తెచ్చానంటే..." అని ఆగావ్.

"ఏమిటది" అని అడగబోయిన దాన్నే... గొంతునొక్కేసి ఆత్రుతను కళ్లకే పరిమితం చేశాను.

నువ్వు గుప్పిటగా చేసిన చేతిని ముందుకు సాచి "తీసుకో" అన్నావు.

గుప్పిట విప్పితే కనబడుతుంది. అప్పటివరకూ ప్రేమికులుగా మనమధ్య చొరవ మాటలకే తప్ప చేతలకు విస్తరించలేదు. స్పర్శకు వెనకాడుతూనే ఉండేవాళ్లం ఎందుకో!

అదే మొహమాటంతో ఒక్కక్షణం తటపటాయించినా, కానుకేమిటో అనే కుతూహలంతో నీ చేతివేళ్లను విప్పబోయాను. అంతదాకా వదులుగానే ఉంచినవాడివి, చప్పున గుప్పిట బిగించేశావ్!

గుప్పిట విప్పటానికి నేను తంటాలు పడ్డాను. తీరా తెరిచి చూస్తే, నీ చేతిలో మల్లెమొగ్గ!

"ఇదా" నా డిజప్పాయింట్‌మెంట్ మొహంతో ఆగలేదు. మాటతో బైటకు వురికింది.

"చ్చొచ్చొచ్చొ! ఎంత నిరాశ! నేనేమో గొప్ప భావుకతతో నీకు అన్నింటికంటే ఇష్టమైన పూలు మల్లెలే కదా అని పట్టుకొస్తే!" అంటూ నవ్వావు.

"మనం కలిశాక నీ ఫస్ట్ బర్త్‌డే! నిన్ను డిజప్పాయింట్ చేస్తే మన ప్రేమకెంత అవమానం!" అంటూ జ్యూవెలరీ షాప్‌కు తీసుకెళ్లావు.

నువ్వు ఉంగరం కొనిస్తుంటే... "మామూలుగా రింగ్ తొడిగేది ఎంగేజ్‌మెంట్‌కే అనుకుంటా" అని నేనే అడిగితే,

"మనం మామూలు ప్రేమికులం కాదని నీకెన్నిసార్లు చెప్పాలి? సంప్రదాయం, చట్టుబండలూ అని కూర్చునేవాళ్లమే అయితే ఇలా కలవకూడదనుకుంటా!" అని నొసలు చిట్లించి వెంటనే నవ్వేశావు.

అలా చక్కటి పానకంలా తయారైన మన ప్రేమను ఆస్వాదించడంలో పుడకల్లాంటి చిన్న సమస్యలు కూడా అడ్డురాలేదు. పెద్దల ఆమోదం లభించడం, పెళ్లయిపోవడం ఓ అదృష్టం.

"లవ్ ఈజ్ బ్లయిండ్... మేరేజ్ ఈజ్ ఐ ఓపెనర్" అన్నట్లు... పెళ్లితో నా కళ్లు నీ నిజరూపాన్ని చూడటానికి తెరుచుకున్నాయి. నన్ను ఎద్దేవా చేయటానికీ, మందలించటానికీ నువ్వు నోరు తెరవటం మొదలెట్టావ్. మనిద్దరి జీతాలూ కలిపి కాదు. ఒక్కొక్కరికీ నెలకొచ్చే జీతమే ఈ దేశంలో ఎంతోమంది అభాగ్యుల సంవత్సరాదాయమంత!

అయినా నువ్వు పిసినారిలా ప్రతి ఖర్చుకీ పదిసార్లు ఆలోచించేవాడివి. దానికి ముసుగు కప్పి "ఇలా ఇష్టమొచ్చినట్లు డబ్బును వాడేస్తే, పిల్లలకు ఏమంత మిగల్చలేం!" అంటూ సణుగుడు. నాకు పిసినారితనం అనిపించేదాన్ని నువ్వు పొదుపంటూ సమర్థించుకుంటావ్! ముందు జాగ్రత్తకోసం నేను చెప్పే మాటల్ని నా భయంగా నువ్వు అర్థం చేసుకుంటావ్.

సాయంత్రం ఎవరింటికైనా వెళ్లినా, లేకపోతే షికారుకో, డిన్నరుకో హోటల్‌కో వెళ్లినా రాత్రి పదింటిలోపే ఇల్లు చేరాలంటే నీ తలకెక్కదు. "రాత్రి పదిదాటాక ఈ సిటీ రోడ్లమీద తిరిగే వాహనాల్లో ఎక్కువ తాగుబోతులవే అయిఉంటాయ్. కనుక యాక్సిడెంట్లవుతాయి. మన జాగ్రత్తలో మనం ఉండాలి" అని నేనంటే నీకు వేళాకోళం.

"పిరికిగొడ్డులా మాట్లాడకు. తాగుబోతులు తిరిగినా పనిగట్టుకుని యాక్సిడెంట్లు చేయరు కదా. అయినా మన వెహికిల్స్‌ను వాళ్లకు అందకుండా నడుపుతాన్లే! నేను డ్రైవింగ్‌లో ఆరితేరాను తెల్సా" అంటూ నువ్వు, నీ నిర్లక్ష్యం డైలాగులు.

మొత్తానికి మన కాపురంలో చిలకాగోరింకల్లాంటి అన్యోన్యత కంటే పిల్లీఎలుకల వైరమే క్రమంగా చోటుచేసుకుంటున్నట్లు నాకు అనిపించి, సందేహాలు పెరుగుతుంటే...

"నువ్వు ఏమైనా ఆలోచించి, ఎలాగైనా ఉండు గానీ అనుమాన పెనుభూతాన్ని మాత్రం నెత్తిన పెట్టుకుని ఊరేగించకు" అంటూ వెధవవెటకారం ఒకటి.

అప్పుడప్పుడూ ఇలాంటి మాటలతో ఒళ్లు మండినా, నీ చేష్టలతో, చేతలతో ఎంతో మైమరపు నిచ్చేవాడివి. మండేవేసవికి ఇటు శీతాకాలం, అటు వానాకాలం తోడైనట్లు. నీ రొమాన్స్ మల్లె గుబాళింపులు, చందనస్పర్శల మేలుకలయికలా నన్ను అలరించేవి. నీ ప్రవర్తనలో తేనె రుచి లేకపోతే నిన్నెప్పుడో తోసిరాజని, ఈ ఫ్లాట్‌కు నేనొక్కదాన్నే రాణినయ్యేదాన్ని.

మా అన్నయ్య పెళ్లయిన కొత్తలో "నీ సొంతఫ్లాట్‌లో నువ్వొక్కదానికే ఉంటున్నావు గనక నేను ఇల్లరికం వచ్చిన అల్లుణ్ని కాదన్నమాట" అన్నావు గుర్తుందా.

ఎప్పుడైనా రెచ్చిపోయి పోట్లాడుకున్నప్పుడు "ఫ్లాట్ నీ సంపాదనతోనువ్వు కొనుక్కున్నది కాబట్టి నాతో వేగలేనప్పుడు నేనే పుట్టింటికి పోవాలని బెదిరిస్తావేమో" అని నవ్వించేవాడివి. మొత్తానికి ఇప్పుడు చిరాకుగా అదేమాట





అనేసి మీ తల్లిదండ్రుల దగ్గరికి (సారీ! మా అత్తమామల ఇంటికి) వెళ్లావు.

నువ్వలా పోట్లాట మధ్యలో ఆ మాటన్నప్పుడు ఇరిటేట్ అయ్యానుగానీ, ఇప్పుడు తలచుకుంటే భలే నవ్వొస్తోందిలే! చినికిచినికి గాలివానైన మన గొడవ ఎక్కడ మొదలైందో ఓసారి గుర్తుచేసుకో!

"ఇక వీలైనంత త్వరలో మన పాపాయి కేరింతలు వినడానికి కృషి చేద్దాం" అని సిగ్గువిడిచి నేనంటే..

"ఆ.. వీల్లేదు. ఈ పోటీ ప్రపంచంలో ఇంకొన్నాళ్లు కెరీరే ఊపిరిగా బతకాలి. మన సేవింగ్స్‌కూడా నా టార్గెట్ ప్రకారం లేవు. కనీసం ఇంకో సంవత్సరం ఆగుదాం" అన్నావు.

"అప్పుడే రెండేళ్లు దాటిపోయాయి. ముచ్చటగా మూడో వెడ్డింగ్ యానివర్సరీకి పాప నా కడుపులోనో, మన కళ్లముందో ఉండాలి" అని నేను.

"పెళ్లికి ముందు ఏమనుకున్నాం? నీ కిష్టమైనప్పుడో, నేను కోరుకున్నప్పుడో కాదు. ఇద్దరికీ మంచి తరుణం అనిపించినప్పుడే తల్లిదండ్రులమవ్వాలి. అనుకున్నామా లేదా" అని గుర్తుచేశావ్.

నేను ప్రస్తుతం నా సేవింగ్స్ ఎలా ఉన్నాయో చెబుతుంటే విన్పించుకోలేదు. "నీది మొండిపట్టు. సరే, ఎవరి మాట నెగ్గుతుందో చూద్దాం" అంటూ వెళ్లావు.

ఇలా మాటల్లోనే సామరస్యం లోపిస్తే, ఏదైనా ఎలా చక్కదిద్దగలం? అందుకే నువ్వు పుట్టింటి నుంచి తిరిగొచ్చేస్తే, మరోసారి అన్నీ వివరంగా చర్చించుకుని, మంచి తరుణం ఇప్పుడో, కాకపోతే మరెప్పుడో ఓ అంగీకారానికి వచ్చేద్దాం.

నా చెవలాయ్! వస్తావు కదా.. నా మాటల్ని నువ్వు ఈ లేఖలో చదవగలవేగానీ, అతి చక్కని నా వాయిస్‌ను అంతదూరం నుంచి వినటం నీ తరమా! అదే సినిమాలో అయితే అక్షరాలు కన్పించడంతో పాటు, మహాచక్కగా మాటలూ విన్పిస్తుంటాయే! అన్నట్టు 'సఖి'లో లానే ఉంది కదా, మన ఈ జీవిత ఘట్టం! నీ నోటంట 'ఐ లవ్ యూ' విన్నప్పుడు కలిగిన పరవశం నాలో అలాగే కంటిన్యూ అయ్యి, ఆ సినిమా కథలో వచ్చిన పరిణామాన్ని నేను కానకుండా చేసింది.

ఎంత ప్రేమించుకున్న వారికైనా, పెళ్లయిన తర్వాత ఉండేవి ఎలాగూ అలాగే ఉంటాయి అని 'సఖి' ద్వారా మణిరత్నం చెప్పిన కథను నేను గుర్తుంచుకుంటే, మన పెళ్లికి ఔననేదాన్నో, కాదనే దాన్నో! ఇవ్వాడవన్నీ ఎందుకులేగానీ, నువ్వెప్పుడొస్తున్నావ్, చెప్పు? తక్షణమే.. మొబైల్‌ఫోన్ నీ జేబులో ఉందో, టేబిల్ మీద ఉంచావో! ఎక్కడున్నా తేడా కొన్ని క్షణాలే కదా– నన్ను పలకరించడానికి! వెయిట్ చేయగలను. ముందు నీ ఫోన్ కోసం! ఆ వెంటనే నీ రాకకోసం!

ఓసారి ఇగ్లిసియాస్ పాడిన ఎస్కేప్ పాటను గుర్తుచేసుకో. అంతేకాదు ఎప్పుడూ గుర్తుంచుకో. ఎందుకంటే అవి అక్షరాలా నా ప్రేమకు వర్తిస్తాయి.

"యు కెన్ రన్,యు కెన్ హైడ్
బట్ యు కాంట్ ఎస్కేప్ మై లవ్.."
(నువ్వు పారిపోగలవు, దాక్కోగలవు
కానీ తప్పించుకోలేవు సుమా నా ప్రేమను)

నీ

లేఖ

అవీ... ఇవీ



సరేనా?!

ఎల్‌కేజీ పిల్లలు లంచ్ బ్రేక్‌లో మాట్లాడుకుంటున్నారు.

వంశీ: రాజూ, నా దగ్గర పది రూపాయలు ఉన్నాయి. ఏం కొన్నుకుందాం?

రాజు: షాపతనికి పది రూపాయలిచ్చి ఇరవై రూపాయలు కొన్నుకుందాం. అప్పుడు నీకు పదిరూపాలు, నాకు పదిరూపాయలు ఉంటాయి... సరేనా?!

- ఎం.ఎం.అబ్బాలోము





దయ

ఓ మనిషి
నీ స్వార్థం మరచి
పాటుపడవోయి
సాటిమనిషిపై
దయతలచి
యువత నీకిచ్చును
చేయూత
అందమై, సుగంధమై
విరజిల్లును నీ భవిత

- ఎన్. దీనబాంధవ

విశిష్ట వ్యక్తి

డా॥ జె.పి. వైద్య

యాడెలింగ్ హీరో - కిషోర్ కుమార్...!

వేపకాయంత పిచ్చి ఉంటే అదరగొట్టి పారేస్తారట.... మరి, ఏకంగా వేపచెట్టంత పిచ్చి ఉంటే?! 'ప్రతిభ ఉన్నవారు అతి చేసినా అతికినట్టే ఉంటుంది' అంటారు పెద్దలు. కళాకారులన్న తర్వాత అంతో ఇంతో ప్రతిభ ఉండాల్సిందే మరి. 'అసాధారణ ప్రతిభ' ఉన్నవారికి 'విపరీతమైన మనస్తత్వం' కూడా ఉంటుందని మానసిక శాస్త్ర నిపుణులు చెప్తారు.

హిందీ సినీ రంగంలో 'ఆల్ ఇన్ వన్'లా దర్శనమిచ్చిన కిషోర్ కుమార్ అసామాన్య ప్రజ్ఞావంతుడు. దర్శకుడు, నిర్మాత, నటుడు, సంగీత దర్శకుడు, రచయిత, గాయకుడు... ఇలా అన్నింటిని తనలో జీర్ణించుకున్న 'కిషోర్ దా' వంకరటింకరగా ఆలపిస్తే – అవి అద్భుతమైన యాడెలింగ్ గీతాలై పోయాయి. అదుపు తప్పినట్లు.. కుదురుగా సాగని కుప్పి గంతుల నటన.. ఆయన్ను 'న భూతో నభవిష్యతి'గా అందలం ఎక్కించింది.

హిందీ సినీ ప్రపంచంలో వేపకాయంత వెర్రిగల మాలోకాలకు కొదవులేదు. ఐ.ఎస్. జోహర్ కూడా బాగా చదువుకున్న 'అసమాన పటిమ' ఉన్న ప్రతిభల పుట్ట. ఆరోజుల్లో 'ఫిలింఫేర్' సినిమా పిచ్చోళ్ళకు 'భగవద్గీత' లాంటిది. అందులో ఐ.ఎస్. జోహార్ ప్రజల ప్రశ్నలకు జవాబులు రాసేవాడు. తలతిక్క ప్రశ్నలకు మహా తుంటరి జవాబులు పేలేవి.

'బానాజి' సినిమా విశ్లేషణలతో పాటు, ఐ.ఎస్. జోహర్ జవాబుల పేజీ కోసం వెర్రెత్తి పోయేవాళ్ళు రసికులు. అప్పట్లో బాబూరావ్ పటేల్‌గారి 'ఫిల్మ్ ఇండియా' అనే పత్రిక ఉండేది. తర్వాతి కాలంలో అంటే 1960లో అది 'మదర్ ఇండియా' లా రూపాన్ని సవరించుకుంది.

సాత్వికమైన హోమియోపతి మందుల ముచ్చట్లతో పాటు, బాబూరావ్‌గారు 'ప్రశ్నలూ... జవాబులూ'తో పత్రికను నింపేసేవారు. ఆయన జవాబుల్లో మచ్చుకైనా సాత్వికత కన్పించేది కాదు.

'లతా మంగేష్కర్ సుతారంగా ఆవులించినా సి.రామచంద్ర (ప్రఖ్యాత హిందీ, మరాఠీ సినీ సంగీత దర్శకుడు, రామచంద్ర చితల్కర్ పేర్న 'ఆనా మేరీ జాన్ సండే కే సండే' లాంటి పాటలతో యువతలో వేపకాయకన్నా ఎక్కువ వెర్రిని ఎక్కించిన ఘనుడు) దానికో 'రాగం' పేరు పెట్టి, ఏ ప్రొడ్యూసర్‌కో అంటగట్టేస్తాడు'... ఇలా ఉండేవి బాబూరావ్ గారి గుట్కా జవాబులు.

అప్పటి హాస్య చక్రవర్తి భగవాన్ దాదా! ఆ తరం వాళ్ళకు జ్ఞాపకం ఉండే ఉంటుంది. 'శామ్ ఢలే, ఖిడికీ తలే- తుమ్ సీటీ బజానా ఛోడ్‌దో' లాంటి పాటలతో అదరగొట్టేవాడాయన. భగవాన్ దాదా, సి.రామచంద్ర మంచి మిత్రులు.

'మాఝ్యా జీవనాచీ సర్‌గమ్' ఆత్మ చరిత్రలో పొట్ట చేతపట్టుకొని నవ్వుకునే ముచ్చట్లు చాలానే చెప్పాడాయన. ఆయన మనవడు నేడు మరాఠీ సాహిత్యంలో డాక్టరేట్ చేసిన సాహితీవేత్త.

మనం మళ్ళీ తిరిగి 'వేపకాయంత పిచ్చోళ్ళ స్వర్గం' వైపు వద్దాం. కిషోర్ అసలు పేరు ఆభాస్ కుమార్ గాంగులి. ఆభాస్ అంటే కాంతి, ఒకటి మరో దానిలా కన్పించే తత్వం అన్నమాట.

చదువూ, బడీ అంటే ఆమడ దూరం పరుగులెత్తి మాయం అయ్యే కిషోర్ శక్తియుక్తులతో ప్రొగ్రెస్ రిపోర్ట్‌లో అద్భుతమైన 'ప్రోగ్రెస్'ను సంపాదించేవాడు.

తండ్రి కుంజలాల్ గాంగులి 'వకాలత్'ను, తల్లి గౌరీదేవి 'జమీందారీ' ఆలోచనలు అస్తమానం నిర్దయగా ఉతికి పారేసేవి. మధ్యతరగతి వాడిని కట్టుకున్నానని వాపోయేది. ఆమె జమీందారీ సణుగుడు 'బాల్ – కిషోర్'కు వింతగా తోచేది.

పెద్దన్నయ్య అశోక్ కుమార్ బాలీవుడ్‌లో అప్పటికే బాగా పేరున్న నటుడు. ఇంట్లో వాళ్ళక్కూడా కిషోర్.. 'అశోక్ కుమార్‌లా నటుడైతే బావుండును అన్పించేది. కానీ కిషోర్‌కు నటన కన్నా పాడటం ఇష్టం...! బాత్‌రూంలో దూరి 'మై బన్ కా పంఛీ...' ని అస్తమానం గునగునాయించేవాడు. ఆ పాట ఆ రోజుల్లో పెద్ద హిట్! కుందన్‌లాల్ సెహెగల్ అంటే పడి చచ్చేవాడు కిషోర్. అలా కిషోర్ బాత్‌రూంలో సైగల్ పాటలను తన్మయంగా గానం చేస్తున్న శుభ ముహూర్తాన ఎస్.డి. బర్మన్ వినడం తటస్థించింది.

"అరేయ్... కిస్సోర్! సైగల్ కో కాపీ మత్ కరో..! కాపీ మాస్టర్ సేనమాలైన్ మే టికతే నాయ్ ... తో మారే ఖుద్‌కే స్టాయిల్ మే గా...వ్" అని నోట్లో పాన్‌రసం జారిపడకుండా సలహా ఇచ్చాడు. అదే సలహా కిషోర్‌ను క్లాస్ యాడెలింగ్ చక్రవర్తిగా మలిచింది. 'ఘుమ్రూ' పాటలు వింటే కిషోర్ తడాఖా ఏమిటో తెలుస్తుంది.

'చల్తీకానామ్ గాడీ' – 'గాంగులీ బ్రదర్స్' సృష్టి... అశోక్ కుమార్, అనూప్ కుమార్, కిషోర్ కుమార్ చేసిన 'గోల' అంతాఇంతా కాదు.

'బాబూ... బాజూ.. సమ్‌ఝో ఇషారేఁ.. హార్న్ పుకారేఁ ...పం....పం....పం' పోర్డ్‌గాడీ సినీ రసికులను ఉర్రూతలూగించింది. 'ఎక్ లడ్కీ భీగీ భాగీసీ' మధుబాలను యువకుల గుండెల్లో శాశ్వతంగా ఫ్రేమ్ చేసి పారేసింది. తర్వాతి రోజుల్లో – మధుబాల, కిషోర్ గుండెలో... ఆనక ఇంట్లో ఇల్లాలిగానూ చేసుకున్నది. అది వేరే కథ.. కాస్తంత ట్రాజెడీ అనుకోండి.

ఆ వేపకాయంత పిచ్చి ఉన్న కిషోర్ నిజ జీవితంలో ఎంత 'ఎక్సెంట్రిక్' అయినా– ఆరాధనలో 'రూప్ తెరా మస్తానా' తోనూ, 'మేరే సప్నోంకి రాణీ కబ్ ఆయేగీ తూ'.. లాంటి జబర్‌దస్త్ గీతాలతో మనలాంటి వేలవేల బుద్ధిమంతుల్ని 'దీవానా'లను చేసి పారేశాడా లేదా? మనం పిచ్చెక్కిపోయి కిషోర్ కుమార్‌నూ, ఆయన గీతాలను తలమీద పెట్టుకొని ఎగిరామా లేదా?!

దటీస్ ఆల్సో 'వేపకాయంత పిచ్చి...!'

మనసా... తెలుసా?



కౌన్సెలింగ్ సైకాలజిస్ట్,
పర్సనాలిటీ
డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్ :
9849130141

హిప్నో కమలాకర్

మేం ఇద్దరం అక్కాచెల్లెళ్ళం. అక్కకు పెళ్ళయింది. మా బాధ్యతంతా మా అమ్మమ్మే చూసుకుంటుంది. అయితే అమ్మమ్మ పోయాక, ఆస్తి విషయంలో మా మామయ్యలతో గొడవలు ఏర్పడి వారు దూరం అయ్యారు. ఉద్యోగం చేద్దామంటే నా అందమే నాకు శత్రువుగా మారిపోయింది. నేనేం చేయాలో అర్థం కావడం లేదు.

- సౌందర్య, అనకాపల్లి.

మీ మావయ్యలకు ఆస్తి విషయంలో మాత్రమే పడలేదు. అంతేకదా! మీ బావకు మీరంటే ఇష్టం కలిగి, మిమ్మల్ని చేసుకునే ఉద్దేశం గనుక అతనికుంటే పెద్దవాళ్ళతో ఆ విషయం మాట్లాడించండి. అతను, మీరూ ఇద్దరూ ఇష్టపడినప్పుడు పెద్దవాళ్ళు కూడా సానుకూలంగా స్పందించే అవకాశం ఉంది. ఇక అందం మీకు శాపమైందని అంటున్నారు. అలా అనుకుంటే అందంగా ఉండే ఏ ఆడపిల్లా ఉద్యోగం చేయలేదు. బయటకు వెళ్ళలేదు. మిమ్మల్ని మీరు రక్షించుకుంటూనే అవతలివారు హద్దులు మీరి ప్రవర్తించకుండా మీ ప్రవర్తనద్వారా కొన్ని పరిమితులు ఏర్పరచుకుంటూ ఉద్యోగం చేస్తే జీవితంలో సక్సెస్ అవుతారు.

నా వయసు 63 సం॥లు. మా వారు మూడేళ్ళ క్రితం గతించారు. పిల్లలిద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ జీవితాల్లో సెటిలయ్యారు. అయితే నా దగ్గరున్న డబ్బంతా వాళ్ళు తీసుకున్నారు. ఇప్పుడు నేను వాళ్ళ భార్యలకు చాకిరీ చేస్తేనే ఇంట్లో ఉంచుకుంటామంటున్నారు. పలు అనారోగ్యాలతో బాధపడుతున్న నేను చాకిరీ చేయలేను. ఓల్డేజ్ హోమ్‌లో చేరటం నాకిష్టంలేదు. ఆత్మహత్య చేసుకోలేను. అలాని బతకగలిగే స్థితిలోనూ లేను. ఈ పరిస్థితిలో నేనేం చేయాలో కాస్త చెప్పండి.

- నిర్మలమ్మ, పెనుగొండ.

ఈ రోజుల్లో ఇలాంటి సమస్యలు చాలా కుటుంబాల్లో తలెత్తుతూనే ఉంటున్నాయి. మీరు అనవసరంగా కొడుకులపై గల ప్రేమతో వాళ్ళు అడిగినదంతా ఇచ్చేసి ఇప్పుడు బాధపడుతున్నారు. ఓల్డేజ్ హోమ్‌లో చేరడానికి సంశయించనవసరం లేదు. అక్కడంతా మీలాంటివాళ్ళే ఉంటారు. ఆప్యాయంగా చూసుకుంటారు. హాయిగా కాలక్షేపం చేయొచ్చు. కాబట్టి సందేహించకుండా చేరండి. మీ వయసువారితో కలిసి శేష జీవితాన్ని హాయిగా గడపండి. ఎవరో ఏదో అనుకుంటారని, ఈ వయసులో అనవసరంగా లేనిపోని బాధలను నెత్తికెత్తుకోవడం తగదు. వృద్ధాశ్రమ నిర్వాహకులు సేవే పరమార్థంగా పనిచేస్తుంటారు కాబట్టి అక్కడే మీకు చక్కటి ఆశ్రయం లభిస్తుంది.

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్ళకు మానసికమైన సమస్యలేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ శ్రీ హిప్నోకమలాకర్ తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

నాకిప్పుడు ఇరవై ఐదేళ్ళు. ఐదేళ్ళ క్రితం 50 వేలిచ్చి నాకు పెళ్ళి చేద్దామనుకున్నారు. అది ఇంట్రస్ట్‌తో కలిపి ఇప్పుడు లక్ష అయింది. నేను సాఫ్ట్ టాయ్స్ కంపెనీలో పనిచేసి మరో 50 వేలు కూడబెట్టాను. ఇంటి పరిస్థితి బాగోక, ముందు అక్క పెళ్ళి చేశాం. నాకు సంపాదన ఉండటంతో ఎక్కువ కట్నం ఇస్తున్నారని కుళ్ళుతో అక్క, అన్నయ్యను సంబంధాలు చూడనివ్వటం లేదు. మంచి సంబంధాలు వచ్చినా అన్నయ్య నచ్చలేదని తిప్పికొడుతున్నాడు. పైగా వాళ్ళకు భారంగా ఉన్నానని దెప్పిపొడుస్తున్నారు. నాకు బైటకు వెళ్ళి బతికే ధైర్యం లేదు. కులాంతర వివాహం చేసుకోవడానికైనా నేను సిద్ధమే. అందుకు నేనేం చేయాలి?

- దేదీప్య, నిడదవోలు.

మీరు డబ్బు సంపాదిస్తున్నారు. మీకాళ్ళ మీద మీరు నిలబడ్డారు. కాబట్టి ఒకరికి భయపడాల్సిన అవసరంలేదు. ధైర్యం ఎక్కడినుంచో రాదు. మనసులోనే ఉంటుంది. మీరు మీ జీవితమార్గాన్ని నిర్ణయించుకోవాలి. పెళ్ళి చేసుకోబోయే వరుడు మీకు నచ్చాలి. అంతేకానీ, మీ అన్నయ్యకు కాదు. మీరు బైటకు వచ్చి ప్రపంచం గురించి, వ్యక్తుల మనస్తత్వాల గురించి తెలుసుకునే ప్రయత్నం చేయండి. ఎలాగూ సాఫ్ట్‌టాయ్స్ తయారు చేసేదాంట్లో పనిచేస్తున్నానంటున్నారు కాబట్టి అందులోనే పనిచేస్తూ నలుగురితో పరిచయాలు పెంచుకోండి. పరిచయాలు పెరిగితే సంబంధాలు వాటంతటవే వస్తాయి. మీకు నచ్చిన సంబంధం చూసి పెళ్ళి చేసుకోండి. మీ జీవితాన్ని హాయిగా గడపండి.



విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

చంద్రునిపై పరిశ్రమలు లాభదాయకమేనా?

చంద్రునిపై పరిశ్రమలు పెట్టడానికీ, గనులు తవ్వడానికీ అయ్యే ఖర్చు ఎంత? అంత ఖర్చు భరించగలిగే స్థితిలో ఏ దేశమైనా ఉందా? అసలు చంద్రునిపై పరిశ్రమలు పెట్టడం, గనులు తవ్వి, అణు ఇంధనాన్ని వెలికితీయడం లాభదాయకమేనా?.. అణుఇంధనానికి ఉపయోగపడే హీలియం3 ఐసోటోపుకోసం, అంతరిక్ష యాంత్రలకోసం చంద్రునిపై స్థావరాలు ఏర్పాటు చేయాలనుకుంటున్నవారికి ఎదురవుతున్న ప్రశ్నలు ఇవన్నీ.

హైడ్రోజన్ బాంబు మాదిరి అణు-సంయోగ ప్రక్రియద్వారా శక్తిని ఉత్పత్తి చేస్తేనే భవిష్యత్తులో మానవుని ఇంధన అవసరాలు తీరుతాయని ఇప్పుడు అందరూ నిర్ధారణకు వచ్చారు. అణు సంయోగప్రక్రియకు హీలియం3 మంచి వనరు అని కూడా భావిస్తున్నారు. చంద్రోపరితలం మీద హీలియం3 అధికంగా ఉంది. దాన్ని తీసి భూమ్మీదకు తీసుకురావడానికి ప్రస్తుత ధరవరల్లో అయ్యే ఖర్చెంతో కూడా లెక్కవేశారు.

1969లో నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడినుండి తెచ్చిన మట్టి నమూనాలోని హీలియం3ని శాస్త్రవేత్తలు పరిశీలించారు. అక్కడ మట్టిలో శతకోటి అణువుల్లో 13 హీలియం3 అణువులున్నట్లు గుర్తించారు. భూమ్మీద చాలా తక్కువ మొత్తంలో ఉన్న హీలియం3ని వెలికితీయాలంటే చాలా పెద్ద భూభాగంలోని కొండలూ, గుట్టలను తవ్వి శుద్ధి చేయాలి. అలా చేస్తే భూమ్మీద ఒక కిలోగ్రాము హీలియం3 వెలికి తీయడానికి సుమారు 90,000 డాలర్లు (సుమారు 40 లక్షల రూపాలయలు) ఖర్చవుతుందని అంచనా. అంతకన్నా తక్కువ ఖర్చుతోనే చంద్రునిమీదనుండి ఈ ఇంధనాన్ని తెచ్చుకోవచ్చు.

ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానంతో చంద్రునిపై హీలియం3 వెలికి తీయడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రత్యేకమైన రోబోట్ యంత్రాలతో చంద్రోపరితలం మీద మట్టి తవ్వి వేడిచేస్తారు. వేడికి మట్టిలోనుండి వివిధ రకాల వాయువులు బయటకు వెలువడుతాయి. ఈ వాయువులను ప్రత్యేక 'ఫిల్టర్లతో' వడపోసి హీలియం3ని వేరుచేస్తారు. చంద్రునిమీదకు వెళ్లే రాకెట్ అభివృద్ధికీ, హీలియం3-డ్యూటీరియం అణు-సంయోగ రియాక్టర్ తయారీకీ, చంద్రునిపై మట్టి తవ్వకాలకూ అంతా కలిపి 1500 కోట్ల డాలర్లు (67,500 కోట్ల రూపాయలు) ఖర్చవుతుందని అంచనా. ప్రస్తుత అంతర్జాతీయ ధరవరల్లో ఒక మామూలు అణు-విచ్ఛేదక రియాక్టరు తయారు చేయాలంటే 1000 కోట్ల డాలర్లు (సుమారు 45,000 కోట్ల రూపాయలు) ఖర్చవుతుందని అంచనా. ఇక భూమ్మీద లభించే ట్రిటియమ్ ఆధారిత అణు-సంయోగ రియాక్టర్ తయారుచేయాలంటే ఇంతకంటే అనేక రెట్లు ఎక్కువ ఖర్చవుతుంది. పైగా ట్రిటియమ్ రియాక్టర్లనుండి వ్యర్థపదార్థాలు ఉత్పత్తి అవుతాయి. వాటిని నిర్వీర్యం చేయడానికీ, ఇతర పర్యావరణ సమస్యలను అధిగమించేందుకూ అయ్యే ఖర్చులను లెక్కవేయలేదు. కాని డ్యూటీరియం-హీలియం3 సంయోగ క్రియలో వెలువడే ప్రోటాన్లు నేరుగా విద్యుత్తుగా మారిపోతాయి. అంటే నీటిని వేడిచేసి టర్బయిన్లు తిప్పాల్సిన అవసరం ఉండదు. అందువల్ల 70 శాతం ఇంధనం శక్తిగా మారిపోతుంది. కనుక శక్తి ఉత్పాదన అధికంగా ఉంటుంది. అందువల్ల డ్యూటీరియం-హీలియం3 రియాక్టర్లు చాలా తక్కువ ఖర్చుతో సమకూరుతాయి. రియాక్టర్ పరిమాణం కూడా చిన్నది. ఇటువంటి రియాక్టర్ తయారుచేయడానికి తొలిదశలో 600 కోట్ల డాలర్లు (సుమారు 27,000 రూపాయలు) ఖర్చవుతుందని అంచనా. ఇప్పటి మార్కెట్ ధరలను బట్టి 1000 మెగా వాట్ల రియాక్టర్ తయారుచేస్తే ఆర్థికంగా గిట్టుబాటు (ఫైనాన్షియల్ బ్రేక్‌త్రూ) అవుతుందని అంచనా వేస్తున్నారు. ఇక చంద్రునిమీదకు భారీ పరికరాలను తీసుకుపోడానికి అతి పెద్ద రాకెట్ నిర్మించాల్సి ఉంటుంది. స్పేస్ షటిల్ ద్వారాగాని, అంతరిక్ష గన్ (స్పేస్ గన్) ద్వారాగాని చంద్రునిమీదనుండి వస్తువులను భూమ్మీదకు చేర్చవచ్చు. గతంలో మానవులను చంద్రునిమీదకు తీసుకుపోయిన అపోలో వ్యోమనౌకను ప్రయోగించిన 'శాటర్న్' రాకెట్లకన్నా భారీ రాకెట్లు అవసరమవుతాయి. 35 ఏళ్ల క్రితం నాటితో పోలిస్తే ఇప్పుడు రాకెట్ సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగింది కాబట్టి ఇదేమీ కష్టమైన పనికాదు. చంద్రునిమీదకు 100 టన్నుల పరికరాలను తీసుకుపోగల రాకెట్ తయారుచేయడానికి 500 కోట్ల డాలర్లు (22,500 కోట్ల రూపాలయలు) ఖర్చవుతుందని అంచనా. అంటే ఒక కిలో బరువును చంద్రునిమీదకు తీసుకుపోడానికి సుమారు 1,35,000 రూపాయలు ఖర్చవుతుందన్న మాట.

చంద్రునిమీద పరిశ్రమలు ప్రారంభించేముందు ఈ లెక్కలన్నీ వేసుకుంటే లాభమేగాని నష్టం కనిపించడం లేదు. పైగా దీనివల్ల అదనపు లాభాలు కూడా వస్తాయి. ఉదాహరణకు చంద్రోపరితలం మీద మానవుని కార్యకలాపాలు పెరిపోతున్నకొద్దీ భూమ్మీదనుండి నీరు, ఆక్సిజన్ వంటి జీవనావసరాలు తీసుకుపోవడం అధికమవుతుంది. దీనికి ప్రత్యామ్నాయంగా చంద్రుని నేల పొరల్లోనే ఈ వనరుల కోసం పరిశోధన చేయడం సాధ్యమవుతుంది. ఈ పదార్థాలు గనుక లభిస్తే అప్పుడు చంద్రునిమీద శాశ్వత మానవ ఆవాసాలు ఏర్పాటుచేయడం సులువవుతుంది. ఇక రెండో లాభం, చంద్రునిమీద మానవ స్థావరాలు పెరుగుతున్నకొద్దీ అక్కడినుండి గ్రహాంతరయానాలకు మార్గం సుగమం అవుతుంది. మరోమాటలో చెప్పాలంటే గ్రహాంతర యాత్రలకు చంద్రుడు ఒక మజిలీగా ఉపయోగపడతాడు.

ఇటీవలికాలంలో అంతరిక్ష విహారయాత్రలు (స్పేస్ టూరిజం) పెరిగిపోతున్నాయి. రానున్న కాలంలో చంద్రునిమీద స్థావరాలు ఏర్పడితే అక్కడికి విహారయాత్రలు (ల్యూనార్ టూరిజం) పెరిగే అవకాశాలు ఉన్నాయి. అంతేకాదు ఖగోళ పరిశోధనలకోసం చంద్రునిపై భారీ ఖగోళ దర్శనులు ఏర్పాటుచేసే అవకాశాలున్నాయి. అన్నిటికీ మించి భూమ్మీదకు దూసుకొస్తున్న గ్రహశకలాలను ముందుగానే కనిపెట్టి వాటిని అంతరిక్షంలోనే ధ్వంసంచేసే ఏర్పాట్లు కూడా చంద్రోపరితలంమీదనే చేయాల్సి ఉంటుంది. అదీగాక భవిష్యత్తులో చంద్రునిమీద గనితవ్వకాలు మనం ఊహించని పదార్థాలూ, ప్రక్రియలూ కనుగొనడానికి కూడా దారితీయవచ్చు.

ఇన్ని ఉపయోగాలున్నాయి గనుకనే అగ్రదేశాలు ఇప్పుడు తిరిగి చంద్రునిమీదకు వెళ్లడానికి తహతహలాడుతున్నాయి. 2008లో అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా' తిరిగి తొలిసారి చంద్రునిమీదకు వ్యోమనౌకను పంపడానికి ప్రణాళికలు వేసింది. ఈ నౌకలో నేలను తవ్వే యంత్రాలు పంపి ప్రయోగాత్మకంగా పరిశీలిస్తారు. బహుశా మరోమారు అంతరిక్ష యాత్రాపోటీకి ఈ యాత్ర శ్రీకారం చుట్టవచ్చు.

కొత్త పుస్తకాలు

ప్రేంచంద్ జీవితం



ప్రేంచంద్ గొప్ప రచయిత. మొదట ఉర్దూలో, తర్వాత హిందీలో ఆయన చేసిన రచనలు ఎంత విశిష్టమైనవో - ఆ పుస్తకాల పునర్ముద్రణలను బట్టి ఇప్పటికీ అర్థం చేసుకోవచ్చు. ఆయన జీవించింది 56ఏళ్లే అయినా ఆయన రచనలలో గోదాన్, ప్రతిజ్ఞ, నిర్మల, రంగభూమి, సేవాసదన్ అజరామరమయ్యాయి.

ప్రేంచంద్ అర్థాంగి శివరాణీదేవి కూడా కథలు రాసేవారు. ఆ అనుభవంతో ఆయన జీవిత చరిత్రను స్వయంగా ఆమే రాశారు. ప్రేంచంద్ జీవిత విశేషాలన్నింటినీ వివరించటంగా కాకుండా, కొన్ని సంఘటనలే చెబుతూ ఓ నవలలాగా, ఈ రచనను ఎంతో ఆసక్తిదాయకంగా మలిచారు. హిందీలో వెలువడిన ఈ పుస్తకాన్ని వాసిరెడ్డి సీతాదేవి అనువదించారు. తెలుగులోనే రాశారేమో అన్పించేలా అనువాదం ఉంది.

'ఎలాంటి స్థితిలో ఉన్నా ప్రేంచంద్ సంతోషంగానే ఉండేవారు. ఏ ప్రాణీ కష్టపడడం ఆయన చూడలేకపోయేవారు. జబ్బుపడ్డా ఆయన తన పని తాను చేస్తూనే ఉండేవారు. ఆయన్ని చూస్తుంటే అసలు ఆయన పుట్టిందే పనిచేయడానికా అనిపించేది. ఆయన సహనం చూసి నాకు చాలా ఆశ్చర్యం కలుగుతుండేది. ఆయనకు విసుగనే మాటే లేదు. తిండి విషయంలో చిన్నపిల్లవాడే. ఏది పెట్టినా మాట్లాడకుండా తిని వెళ్లేవారు...' ఆయా విషయాలు చదువుతుంటే అంత విశిష్ట రచయిత, సామాన్యంగా ఉంటూనే ఎంత అసామాన్య జీవితం గడిపాడో తెలుస్తుంది.

'మనదేశం బ్రిటీష్‌పాలనలో ఉంది. మన పూర్వులు భోగవిలాసాల్లో ఒళ్లుమరచి దేశాన్ని అన్యాక్రాంతం చేశారు. తెల్లవాళ్ళకంటే వారి సేవకావృత్తిని సంపాదించిన మన ఇండియా బాబులు రొమ్ము విరుచుకు తిరుగుతున్నారు. మనకు స్వరాజ్యం లభించటంకంటే భావదాస్యం నుండి విముక్తి పొందటం కష్టతరమైనది' సర్కారు ఉద్యోగం మాని, బ్రిటీష్ ప్రభుత్వాన్ని తుదముట్టించాలనుకున్నప్పుడు భార్యతో ప్రేంచంద్ మాట్లాడిన మాటలివి. ఆ మాటలు ఇప్పటి పరిస్థితికీ వర్తించేలా ఉండడం మన దురదృష్టమని బాధపడే బదులు, మనకు రావాల్సిన మార్పుగురించి పరిశీలించుకుని కర్తవ్యం తెల్సుకోవడం ప్రయోజనకరం.

- శ్రీకృష్ణ వరప్రసాద్

(ప్రేంచంద్ జీవితం, హిందీ మూలం: శ్రీమతి శివరాణీదేవి, తెలుగు అనువాదం : వాసిరెడ్డి సీతాదేవి, వెల: 30/-, పేజీలు : 109, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన భవన్, అబిడ్స్, విశాలాంధ్రబుక్ హౌస్ అన్ని

భారతీయ సమాజం నేటిరాజకీయసామాజికపరిణామాలు

బి.ఎస్. రాములు

వెల:75/-, పేజీలు:181

ప్రతులకు :

విశాలసాహిత్య అకాడమి

2-2-186/53/5, రామకృష్ణానగర్, బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్

బాలలు జాతి సంపద

వి.ఎస్.కమల

వెల: 15/-,

పేజీలు: 88

ప్రతులకు :

మణి బుక్ స్టాల్, సండే మార్కెట్, నెల్లూరు.

మైత్రి బుక్ హౌస్, మసీదు వీధి చివర, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ.

కోమలి గాంధారం

రచయిత్రి మృణాళినే కోమలిగా పరకాయప్రవేశం చేసి రాసిన 54 స్త్రీవాద కథలు, గల్పికలు ఆవిడ చేసిన ఒక విలక్షణమైన ప్రయోగమని చెప్పొచ్చు. అతి సాధారణంకాని ఫక్కీని ఎన్నుకుని భర్తను, ఇతర మగాళ్లను, వారి ఆధిపత్యాన్ని తీవ్రవిమర్శకు గురికానివ్వక, పురుషాధిక్యతను హాస్యస్ఫోరకంగా చిత్రిస్తూ రాసిన కథలివి. 'మాయదారి ముగ్గు', 'నోమిని' వంటి బుల్లికథలు ఆధునిక సమాజం ఆడవారిని ఏ విధంగా చూస్తుందో తేల్చి చెప్పే రచనలు. కేవలం స్త్రీలే సంప్రదాయాలను, ఆచారాలను పాటించాలి, నిలబెట్టాలి అనే సూత్రాన్ని ఖండించే కథ 'భారతీయ భార్య'. ఇంకా 'స్త్రీవాద విమర్శకుడు', 'ఆమె భర్త', 'ప్రోత్సహించే భర్త' మొదలైనవి మంచి వ్యంగ్యాస్త్రాలని చెప్పాలి.

మనకు ఇళ్లలో, ఉద్యోగసంస్థల్లో ఎదురయ్యే పలురకాల సన్నివేశాలూ, ఎదుర్కొనే సమస్యలూ ఈ కథల్లో చిత్రించినప్పటికీ స్త్రీకోణంనుంచి చూపించినదే అధికం. మునిమాణిక్యం 'కాంతం కథలు', భానుమతి 'అత్తగారి కథలు', పురాణం సీత (పురాణం సుబ్రహ్మణ్యశర్మ) 'ఇల్లాలి ముచ్చట్లు'లాగే ఇవీ ఉంటాయి. మృణాళిని సృష్టించిన 'కోమలి' కూడా భాషాభావ సౌకుమార్యం గలది. అత్తమావల్ని తనవైపు తిప్పుకోగల నేర్పరి. అంతే కాదు భర్తను, అతగాడి స్నేహితులను, కొలీగ్స్‌ను ఖంగుతినిపించగల చాతుర్యం కలది. చమత్కారమే ఆమెకు వజ్రాయుధం.

ప్రతికథలోనూ వక్రోక్తి ఊపిరిగా అగుపిస్తుంది. చేరా గారు చెప్పినట్టు గురజాడవారి మధురవాణి తర్వాత అంత సెన్సాఫ్ హ్యూమరున్నదే! కాకపోతే ఆమె వేశ్య. ఈమె సంసారి. 'భోజ్యేషు భర్తగా వక్రీకరించిన శ్లోకంలోని అసలురూపం 'భోజ్యేషు మాత'. దాన్లో వ్యంగ్యం ఆయువుపట్టు. ఈర్ష్య, అలక, వ్యామోహం, అభద్రత, జగడాల మారితనం, అనైక్యత, గాసిపింగ్ ఇటువంటి ఎన్నో గుణాలు కేవలం స్త్రీకి వర్తించేవి మాత్రమే కాదు. పురుషుడికీ అంతే స్థాయిలో ఉన్నాయన్న అంశం అక్షరసత్యం. ఈ పుస్తకం రెండో ముద్రణతోటే ఆగిపోదు. మరిన్ని ముద్రణలకు నోచుకోగల సత్తా దీనికున్నది.

- డా॥ మంతెన

(కోమలి గాంధారం, రచయిత్రి : మృణాళిని, స్త్రీవాద కథాసంపుటి, వెల: 50/-, పేజీలు: 152, ప్రతులకు: విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ, నవయుగ, హోసం క్లబ్స్)

రుచి

సమోసాలు

కావలసిన పదార్థాలు

గోధుమపిండి - ఒక కప్పు
మైదాపిండి - ఒక కప్పు
బంగాళాదుంపలు - పావుకేజీ
ఉల్లిపాయలు - రెండు పెద్దవి
అల్లం, వెల్లులి పేస్ట్ - ఒక స్పూన్
బఠాణీలు - అరకప్పు
కారం - ఒక స్పూన్
ఉప్పు - తగినంత
పచ్చిమిర్చి - ఒక స్పూన్
పసుపు - చిటికెడు
నూనె - తగినంత

తయారు చేసే పద్ధతి

ముందట బఠాణీలు ఓపూట నానబెట్టి బంగాళాదుంపలు, బఠాణీలను ప్రెషర్‌ప్యాన్‌లో ఉడికించుకోవాలి. బంగాళాదుంపలు పొట్టుతీసి చిన్న ముక్కలు చేసుకోవాలి. స్టౌమీద గిన్నె పెట్టి నూనె వేసి ఉల్లిపాయ ముక్కలు వేసి, పచ్చిమిర్చి అల్లం వెల్లుల్లి వేసి వేయించి ఇందాకటి ముక్కలు, బఠాణీలు వేసి పసుపు, కారం ఉప్పు వేసి బాగా కలిపి, కొద్దిసేపుంచి దించుకోవాలి. మైదా, గోధుమ పిండిలను ఉప్పు, నీరు పోసి పూరీ పిండిలా కలుపుకోవాలి. వీటిని చిన్నముద్దలుగా తీసుకొని పూరీల్లా చేసుకుని, అందులో ఇందాకటి కూర పెట్టి త్రికోణం షేపు వచ్చేలా మడవాలి. అన్నీ అలా చేసుకుని వాటిని కళాయిలో వేసి వేయించుకోవాలి.

బీట్‌రూట్‌తో పూరీలు

కావలసిన పదార్థాలు

తరిగిన బీట్‌రూట్ - రెండుకప్పులు
మైదాపిండి - రెండు కప్పులు
బొంబాయి రవ్వ - రెండు కప్పులు
పంచదార - రెండు కప్పులు
పాలు - మూడు కప్పులు
నెయ్యి - అరకప్పు
యాలకుల పొడి - ఒక స్పూన్
నూనె - వేయించడానికి సరిపడా

తయారు చేసే పద్ధతి

బీట్‌రూట్‌లను శుభ్రంగా కడిగి తురుముకోవాలి. దీనిని నేతిలో వేయించి పాలల్లో ఉడికించుకోవాలి. పంచదారను గ్రైండ్‌చేసి మైదాపిండిలో వేసి కలిపి, బొంబాయిరవ్వను కూడా నేతిలో వేయించి వీటన్నింటినీ బీట్‌రూట్ ముద్దలో వేసి అవసరమయితే నీళ్ళు చల్లి పూరీ పిండిలా గట్టిగా కలుపుకోవాలి. వీటిని చిన్న ముద్దలుగా తీసుకొని పూరీల్లా చేసుకొని, కళాయిలో నూనె పోసి కాగనిచ్చి అందులో వేసి వేయించుకోవాలి. ఇవి రుచిగా ఉండటమే కాక ఆరోగ్యం కూడా.

- జ్యోతి, ఖమ్మం



గొప్ప సత్కారం

చాలాకాలం కిందట మన దేశానికి దక్షిణాన విజయనగరం అనే రాజ్యం ఉండేది. దానిని విజయప్రతాప్ సింహ్ అనే రాజు పరిపాలించేవాడు. ఆయన చాలా తెలివైనవాడు. శ్రమ విలువ తెలిసినవాడు. తన బుద్ధిబలంతో, ధనబలంతో చాలా రాజ్యాలను జయించాడు. ఆయనలో ఏవిధమైన పక్షపాత బుద్ధీ లేదు. జ్ఞాన సంపన్నుడు కాబట్టి ఆయన అన్ని రంగాల్లోనూ నిష్ణాతులైన వారికి పోటీలు పెట్టేవాడు. ఆ పోటీల్లో గెలిచినవారికి బహుమతులు ఇచ్చేవాడు.

తాను శ్రమించి పని చేసేవాడవడంవల్ల అలాంటివాళ్లను ఎక్కువగా గౌరవించేవాడు. ఒకరోజు అలాంటి సందర్భంలో మంత్రితో సలహా సంప్రదింపులు జరుపుతున్నాడు.

"మహారాజా! అందరూ మీలా శ్రమించి పనిచేసేవారే అయితే మన రాజ్యం ఎంత గొప్పగానో అభివృద్ధి చెంది ఉండేది. మన రాజ్యంలో సోమరిపోతులు తక్కువగా ఏంలేరు!!" అన్నాడు మంత్రి.

రాజు ఈ మాట విని నోట మాట లేకుండా ఉండిపోయాడు. 'తన రాజ్యంలో సోమరిపోతులా?' అని కాసేపు ఆలోచనలోపడ్డాడు. ఆయనకో ఆలోచన వచ్చింది. మంత్రితో రహస్యంగా మంతనాలాడాడు.

ఆ తరువాత దేశం మొత్తంలో వున్న సోమరులందరికీ పోటీ పెట్టబోతున్నట్టు చాటింపు వేయించాడు. పోటీదారులకు సత్కారం చేస్తామని కూడా చాటించాడు. పోటీ జరిపే రోజు, సమయం నిర్ధారించారు. ప్రహరీ గోడలన్నింటి మీదా పోటీ గురించి రాయించారు. రాజ్యమంతటా దీని గురించి బాగా ప్రచారం జరిగింది.

అయితే రాజు బహుమతుల గురించి ఏ చాటింపులోనూ, ప్రకటనలోనూ చెప్పలేదు. కానీ, పోటీదారులందరూ "ప్రతి పోటీలో మంచి బహుమతులు ఇస్తారు. దీనికి మాత్రం ఎందుకివ్వరు? ఈ విషయం ప్రకటనలో ఎందుకు లేదు?" అనుకుని ఆశ్చర్యపోయారు.

శ్రమించి పని చేసేవారూ, వివేకవంతులు, బద్ధకం అన్నది ఎరగనివారు ఈ చాటింపును పట్టించుకోలేదు. వాళ్లంతా ఎప్పటిలాగే తమ తమ పనుల్లో మునిగి ఉన్నారు.

సోమరిపోతులు, బుద్ధిహీనులు, పని చేయడానికి ఇష్టంలేని బద్ధకస్తులు, ఇతరుల మీద ఆధారపడి బతికేయడమే సుఖం అని అనుకునేవారు... వీళ్లందరికీ ఈ పోటీ దేవుడి వరంలా అనిపించింది. రాజుగారు అన్ని రంగాల్లోనూ, అన్ని రకాల వారికీ పోటీలు పెడ్తుంటారు. 'మరి సోమరిపోతుల గురించి మాత్రం ఎందుకు ఆలోచించరు?' అని వాళ్లు అనుకున్నారు. ఆ పోటీ జరిగే రోజు కోసం ఎంతో ఉత్సాహంగా తయారవడం మొదలుపెట్టారు.

పోటీ రోజున సోమరులంతా రాజుగారి ఆస్థానానికి వచ్చారు. వాళ్లతో సభా భవనం నిండిపోయింది. లోపల చోటులేక చాలామంది సభా భవనం ఎదురుగా వున్న మైదానంలో కూర్చున్నారు. వీళ్లను చూసి రాజు ఆశ్చర్యపోయాడు. 'ఇంతమంది సోమరిపోతులు నా రాజ్యంలో ఉన్నారా!! ఇది ఇంతవరకూ నాకు తెలియనేలేదు!' అనుకున్నాడు.

'నేను ఇంత శ్రమించి పని చేస్తాను. శ్రమించి పని చేసేవాళ్లంటే ఎంతో ఇష్టపడతాను! వారిని ప్రోత్సహించడానికి పోటీలు పెట్టి బహుమతులు కూడా ఇస్తుంటాను. మరి నాలాంటి శ్రమించే రాజును కూడా ప్రజలు ఆదర్శంగా తీసుకోలేకపోయారు' అని అనుకున్నాడు. ఇలా అనుకోగానే రాజుగారికి కోపం భగ్గుమంది.

"ఈ సోమరిపోతులందర్నీ కారాగారంలో కుక్కిపడేయండి. వీళ్లతో పిండి విసిరించండి. గానుగ ఆడించండి. భూమి దున్నించండి. అన్ని పనులూ చేయించండి" అని సైనికులను ఆజ్ఞాపించాడు.

సోమరిపోతులు విస్తుపోయారు. 'ఇదేంటి? రాజుగారు పోటీకి వచ్చిన అభ్యర్థులను సత్కరిస్తామని అన్నారు. దానికి బదులుగా కారాగారంలో కుక్కుతారా? మాతో కఠినమైన పనులు చేయిస్తారా?" అని అడ్డగోలుగా మాట్లాడారు.

ఇంతలో మహారాజుగారి ప్రకటన గట్టిగా వినిపించింది. "సోమరిపోతులను శ్రమించే పనిలో పెట్టడమే వారికి చేసే గొప్ప సత్కారం!"